ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 133 శుక్రవారం 01 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 133 Friday 01 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# కవిత కొత్త పార్టీకి
# ఈసీ గ్రీన్ సిగ్నల్

## కానీ పార్టీ పేరులో మార్పు!

- కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం
- 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)గా పార్టీ పేరు ఖరారు
- మొదట 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించిన కవిత
- బంజారాహిల్స్‌లోని నివాసంలో కవితకు లేఖ అందజేసిన అధికారులు




**వార్త సంధ్య , హైదరాబాద్, ఏప్రిల్ 30 :**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించిన కొత్త రాజకీయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. కవిత పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) అనే పేరును ఖరారు చేస్తూ సీఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి అధికారిక లేఖను అందజేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో కవిత తన కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సభలో పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా వెల్లడించారు. అయితే, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం ఆ పేరుకు బదులుగా 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఆమోదం తెలిపింది. ఈ పేరును కవితకు కేటాయిస్తున్నట్లు - మిగతా 2 లో

## మే 10న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన



- కీలక విషయాలను వెల్లడించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- రాష్ట్రంలో రూ. 7,823 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్న కిషన్ రెడ్డి
- రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడి

**వార్త సంధ్య , హైదరాబాద్, ఏప్రిల్ 30 :**
తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన మీడియాకు - మిగతా 2 లో




వి. హనుమంతరావుకు
## కీలక పదవి

- బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం
- అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర మంత్రి సమాన హోదాలో ఈ పదవిలో వీహెచ్ నియామకం

# డబ్బుతో కొనేశారు...

- ఎగ్జిట్ పోల్స్ పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు
- ఎగ్జిట్ పోల్స్ అన్నీ బూటకం అంటూ మమతా ఫైర్
- మీడియాకు బీజేపీ డబ్బులిచ్చి తప్పుడు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయించిందని ఆరోపణ
- స్టాక్ మార్కెట్ పతనాన్ని, కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీయడానికే ఈ కుట్ర అని ఆగ్రహం
- ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను కాపాడాలని కార్యకర్తలకు పిలుపు
- తాను కూడా వ్యక్తిగతంగా వీధుల్లోకి వచ్చి కాపలా కాస్తానన్న దీదీ




**వార్త సంధ్య , పశ్చిమ బెంగాల్ , ఏప్రిల్ 30 :**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందంటూ వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌ను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. అవన్నీ బూటకమని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ (బీజేపీ) డబ్బులు ఇచ్చి, ఒత్తిడి చేసి మీడియా సంస్థల ద్వారా వాటిని ప్రసారం చేయించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు గురువారం తన సోషల్ మీడియా ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోకుండా నిరోధించడం, మే 4న జరిగే ఓట్ల లెక్కింపునకు ముందే తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ఉద్దేశమని మమత వివరించారు. "నిజానికి తృణమూల్ 226 నుంచి 230కి పైగా స్థానాలు గెలుస్తుందని బీజేపీకి అర్థమైంది. అందుకే మీడియాను అడ్డం పెట్టుకుని ఈ పని చేశారు. బుధవారం మధ్యాహ్నం 1:08 గంటలకు ఎగ్జిట్ పోల్ అంచనాలను మీడియా సంస్థలకు పంపినట్లు నా వద్ద కచ్చితమైన - మిగతా 2 లో

## ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

- ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని హెచ్చరిక




## నేటి నుండి అమల్లోకి గ్యాస్ సిలిండర్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ వరకు కొత్త రూల్స్!

- నేటి నుండి అమల్లోకి రానున్న పలు ఆర్థిక, నియంత్రణ పరమైన మార్పులు
- ఎల్‌పీజీ సిలిండర్ ధరలు, బుకింగ్, డెలివరీ నిబంధనల్లో కీలక మార్పులు
- ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై పెరగనున్న లేట్ పేమెంట్ ఫీజులు.. మారనున్న ఫీజు మినహాయింపు రూల్స్
- ఆన్‌లైన్ గేమింగ్ కోసం కఠినమైన కొత్త చట్టం, ప్రత్యేక అథారిటీ ఏర్పాటు







## ఏపీకి భారీగా నిధులు మంజూరు చేసిన కేంద్రం

- కేంద్ర మంత్రి పెమ్మసాని స్పందన
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏపీకి రూ. 1,192 కోట్ల నిధులు మంజూరు
- నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భరోసా కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడి

## ఏపీ క్యాబినెట్ భేటీ ఆమోదం పొందిన 41 అంశాలు




- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం
- వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 41 కీలక అంశాలకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్
- అమరావతి నిర్మాణ పనులు, కరకట్టకు నిధులు, పోలవరం నిర్వాసితులకు లబ్ధి
- 23 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు
- పలు సంస్థలకు భూ కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పరిపాలన ఆమోదం

**వార్త సంధ్య , అమరావతి, ఏప్రిల్ 30 :**
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు శాఖలకు సంబంధించి మొత్తం 41 కీలక అంశాలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. హోంశాఖ, న్యాయ, పంచాయతీరాజ్, పరిశ్రమలు, పురపాలక, జలవనరులు, రెవెన్యూ వంటి అనేక శాఖలకు సంబంధించిన - మిగతా 2 లో

# అమరావతిపై దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

- కేబినెట్ సమావేశంలో మంత్రులకు చంద్రబాబు పలు సూచనలు
- మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ విమర్శలను ఖండించిన చంద్రబాబు
- సింగపూర్ మరెవరికీ ఇవ్వని అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని వెల్లడి
- అమరావతిలోని భవనాలను ప్రపంచ స్థాయిలో నిర్మిస్తున్నామన్న సీఎం
- ఏఐ, ఐటీపై మంత్రులు అవగాహన పెంచుకోవాలని సూచన
- జలధార, జల హారతి, సూర్యఘర్ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని ఆదేశం



**వార్త సంధ్య , అమరావతి, ఏప్రిల్ 30 :**
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మంత్రుల సింగపూర్ పర్యటన, అభివృద్ధి పనులపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ చేస్తున్న విమర్శలను సీఎం తీవ్రంగా ఖండించారు. సింగపూర్ ప్రభుత్వం మరెవరికీ ఇవ్వని అరుదైన అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని, దీనిని రాజకీయం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో మెళకువలు, సంపద సృష్టి కోసం జరిగిన ఈ పర్యటనను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. "మనం ఇతర దేశాల కంటే - మిగతా 2 లో

# సంపాదకీయం

## మణిపూర్ చక్కబడేదెన్నడు?



మణిపూర్‌లో తీవ్ర హింసాత్మక ఘటనలు జరిగి మూడేళ్లు కావస్తున్నా అక్కడింకా పరిస్థితులు చక్కబడలేదని తాజా ఉదంతాలు నిరూపిస్తున్నాయి. 2023 మే నెలలో హింసకు దారితీసిన వదంతులే ఇప్పటికీ ఆ రాష్ట్రాన్ని శాసిస్తున్నాయి. బీరేన్ సింగ్ నాయ కత్వంలోని బీజేపీ ప్రభుత్వం పోయి రాష్ట్రపతి పాలన వచ్చింది. అది ఏడాది కొనసాగాక మొన్న ఫిబ్రవరిలో ఆ పార్టీకి చెందిన ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యాన కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కానీ పరస్పర అపనమ్మకం, జాతి విద్వేషాలు ఆగిందిలేదు. వందలాదిమంది ఆయుధాలు ధరించి గుంపులుగా బయల్దేరి ఊళ్లమీద పడి నిర్విచక్షణగా హత్యాకాండకు, అత్యాచారాలకు పాల్పడటం, ప్రార్థనా స్థలాలు, ఆవాసాలు తగలబెట్టడం ఇప్పుడు లేక పోవచ్చుగానీ... అవతలి పక్షంపై ఆగ్రహావేశాలు తగ్గలేదు. తరచుగా నిరసన ప్రదర్శనలు జరగటం, రహదారులను స్తంభింపజేయటం ఆగలేదు. కేంద్ర బలగాల సంఖ్యను పెంచటం, నిరంతర పహారా వంటివి హింసాత్మక ఉదంతాలను గణనీయంగా కట్టడి చేశాయి. కానీ ఇప్పటికీ విద్వేషాన్ని రెచ్చగొట్టే సందేశాలూ, తప్పుడు సమాచారం వ్యాప్తిలోనే ఉన్నాయి.ఈ నెల మొదటివారంలో ఒక ఇంటిపై బాంబుపడి ఇద్దరు పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఆ బాంబు కుకీలు నివసిస్తున్న ప్రాంతంనుంచి వచ్చిపడిందనీ, వారికి భద్రతా బలగాలు కొమ్ముకాస్తున్నా యనీ ప్రచారం వెల్లువెత్తడంతో జనం ఒక సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడి చేశారు. అటుగా వాహనంలో వెళ్తున్న అస్సాం రైఫిల్స్‌కు చెందిన అధికారిని గుంపు చుట్టుముట్టి దౌర్జన్యం చేసింది. ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తుండగా భద్రతా బలగాలు రక్షించగలిగాయి. మొన్న మంగళవారం ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ముఖ్య మంత్రిని ఆందోళనకారులు అడ్డుకున్నప్పుడు లాఠీచార్జి చేసినా, బాష్పవాయు గోళాలు ప్రయోగించినా ఫలితం లేకపోయింది. చివరకు హెలికాప్టర్ తెప్పించుకుని అక్కడినుంచి ఆయన బయటపడాల్సి వచ్చింది. అంతకుముందు ఒక మాజీ సైనికుడితో సహా ఇద్దరు నాగా జాతీయుల్ని మిలిటెంట్లు హతమార్చారు.మూడేళ్ల క్రితం మెయితీలకూ, కుకీలకూ మధ్య వైరం హింసకు దారితీయగా ఇప్పుడు మెయితీల గురి నాగాలపై కూడా పడింది. ఒక పద్ధతి ప్రకారం వదంతులు వ్యాప్తిచేయటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించటం ఇంకా ఆగలేదు. అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమంటే... ఆ వదంతుల్ని ఖండిస్తూ పోలీసులు ప్రకటనలు విడుదల చేస్తున్నారు. కానీ ఉద్రిక్తతల్ని ఆపటంలో అవి పెద్దగా ఉపయోగపడటం లేదు. గతంలో బీరేన్ సింగ్ ప్రభుత్వ హయాంలో మెయితీలకు చెందిన సాయుధ మిలిటెంట్ సంస్థ ఆరంబాయ్ టెంగోల్‌ను చూసీచూడనట్టు వదిలేశారు. కుకీల 'దురాక్రమణల్ని' అడ్డుకునే పేరిట ఏర్పడిన ఆ సంస్థ కుకీలకూ, నాగాలకూ మాత్రమే కాదు, వారిని ప్రశ్నించే మెయితీలకు సైతం పెద్ద బెడదగా పరిణమించింది. బెదిరించటం, దౌర్జన్యం చేయటం, బలవంతంగా వసూళ్లకు పాల్పడటం ఆ సంస్థకు నిత్యకృత్యమైంది.మూడేళ్లనాటి ఉదంతాలతో పోలిస్తే హింసాత్మక ఘటనలు తగ్గివుండొచ్చు. కానీ ఇప్పటికీ సమాజం చీలికలు, పేలికలుగా ఉంది. మెయితీలూ, కుకీలూ ఒకరి ప్రాంతంలోకి ఒకరు వెళ్లలేకపోతున్నారు. పనిచేయగలిగిన సత్తావుండి అది దొరుకుతుందన్న భరోసా ఉన్నచోటకు పోలేకపోవటం, పై చదువులకు అర్హతలున్నా ఊరు కదల్లేక పోవటంకన్నా మించిన హింస ఏం ఉంటుంది? పరిమిత వనరులు, ఉపాధి లేమి, భిన్న తెగలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవటంవంటి కారణాలవల్లే అసంతృప్తి అవధులు దాటుతోంది.యువతకు ఉపాధి కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం, వారికి మెరుగైన అవకాశాలు రావటానికి తగిన ప్రణాళికలు రూపకల్పన చేయటంవంటి ప్రయత్నాలు ఎక్కడా కనబడవు. కనుకనే మిలిటెంట్ సంస్థల ఆధిపత్యం సాగుతోంది. మౌలిక సమస్యల్ని పరిష్కరించలేని రాజకీయ నేతలు ఓట్లు రాబట్టుకోవటానికి మాత్రం ఆయా తెగల్ని శాసించగల మిలిటెంటు సంస్థలకు సహకరిస్తున్నారు. ఇది కొనసాగినంత కాలమూ మణిపూర్ నెత్తురోడుతూనే ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిస్తేనే ఆ రాష్ట్రం తెరిపిన పడుతుంది.

## అమరావతిపై దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

మొదటిపేజీ తరువాయి - తక్కువ ఖర్చుతో, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణాలు చేస్తున్నాం" అని స్పష్టం చేస్తూ, రాజధాని అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని దీటుగా ఎదుర్కోవాలని ఆదేశించారు.అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి భవనాలను ప్రపంచస్థాయి కట్టడాలుగా నిర్మిస్తున్నామని, ఇవి రాష్ట్రానికి గర్వకారణంగా మారుతాయని సీఎం తెలిపారు. ధరల విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను వాస్తవాలతో సహా తిప్పికొట్టాలని సూచించారు. ఇంధన కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సాధారణ స్థితికి తెచ్చిందని గుర్తు చేశారు.రాష్ట్ర పాలనలో ఏఐ, ఐటీ వినియోగాన్ని పెంచాలని... మంత్రులు కూడా ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఉద్యోగుల నియామకాల్లో కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయాలనే ఆలోచనను పంచుకున్నారు.కేవలం రాజకీయాలే కాకుండా, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని మంత్రులను ఆదేశించారు. జలధార, జల హారతి, సూర్యఘర్ (ఇళ్లపై సోలార్) వంటి కార్యక్రమాల లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని సూచించారు.

## ఏపీకి భారీగా నిధులు మంజూరు చేసిన కేంద్రం

మొదటిపేజీ తరువాయి - మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏపీకి కేంద్ర ప్రభుత్వం రూ. 1,192.16 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధుల్లో సింహభాగం, అంటే రూ. 1,123.15 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద కేటాయించారు. దీనివల్ల గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, చెరువుల పూడికతీత వంటి శాశ్వత ప్రాతిపదికన నిర్మించే పనులకు ఊతం లభిస్తుంది. మిగిలిన రూ. 69.01 కోట్లు అడ్మిన్ కాంపోనెంట్ కోసం వినియోగించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నిధులు ముందుగానే మంజూరు కావడం గమనార్హం.కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేశారు. లక్షలాది మంది కూలీలకు వేతనాలు నేరుగా అందేలా పారదర్శక వ్యవస్థను బలోపేతం చేస్తామని, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా, గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భరోసా కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని పెమ్మసాని అన్నారు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తామని తెలిపారు. నిన్ననే దీనదయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పథకం కింద రూ. 207 కోట్లు విడుదల కాగా, నేడు ఉపాధి హామీ నిధులు రావడం... రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధను ప్రతిబింబిస్తోంది.

## డబ్బుతో కొనేశారు...

మొదటిపేజీ తరువాయి - సమాచారం ఉంది" అని ఆమె అన్నారు.కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు కలిసి ప్రజలపై, తమ కార్యకర్తలపై అఘాయిత్యాలకు పాల్పడినప్పటికీ, ఎండను సైతం లెక్కచేయకుండా ఓటు వేసిన సామాన్య ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. "బెంగాల్‌ను కైవసం చేసుకోవాలనుకున్న వారి భవిష్యత్తు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఎన్నో అణచివేతలను ఎదుర్కొని పోరాడిన నా పార్టీ కార్యకర్తలకు కూడా నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా" అని మమత పేర్కొన్నారు.ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే వరకు ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా కాపలా కాయాలని ఆమె పార్టీ కార్యకర్తలకు, కౌంటింగ్ ఏజెంట్లకు పిలుపునిచ్చారు. తాను కూడా వ్యక్తిగతంగా వీధుల్లోకి వచ్చి స్ట్రాంగ్ రూమ్‌లను కాపాడతానని, తనను చూసి కార్యకర్తలు కూడా ధైర్యంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ పూర్తయి, తాను ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టే వరకు ఏజెంట్లు టేబుళ్ల వద్ద నుంచి కదలవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే, నమ్మకమైన వారిని ప్రత్యామ్నాయంగా ఉంచి వెళ్లాలని ఆదేశించారు.

## కవిత కొత్త పార్టీకి ఈసీ గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి - ధృవీకరిస్తూ ఎన్నికల సంఘం పంపిన లేఖతో, ఆమె పార్టీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక కీలక ఘట్టం పూర్తయింది. ఈ అధికారిక ఆమోదంతో కవిత తన రాజకీయ కార్యకలాపాలను 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ముందుకు తీసుకెళ్లనున్నారు.

# ఏపీ క్యాబినెట్ భేటీ... ఆమోదం పొందిన 41 అంశాలు

మొదటిపేజీ తరువాయి - ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

క్యాబినెట్ తీసుకున్న 41 కీలక నిర్ణయాలు ఇవే...

1. 23 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 385 మందికి హెడ్ కానిస్టేబుళుగా పదోన్నతి కల్పిస్తూ వారి పోస్టులను అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం.
2. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని న్యాయ విభాగాల్లో 5 చీఫ్ కోర్ట్ మేనేజర్, 15 సీనియర్ కోర్ట్ మేనేజర్ పోస్టులతో సహా మొత్తం 21 కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం.
3. న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ కార్యాలయం కోసం ఒక ఆఫీస్ మేనేజర్ పోస్టును కొత్తగా ఏర్పాటు చేయడానికి నిర్ణయం.
4. ఉపయోగంలో లేని 20 పోస్టులను రద్దు చేసి, పరిశోధన సంస్థల్లో అవసరమైన చోట 20 కొత్త పోస్టులను సృష్టించడానికి ఆమోదం.
5. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో భాగంగా డ్రెడ్జింగ్, పర్యావరణ నిబంధనల మేరకు అదనపు పనుల కోసం రూ.354.23 కోట్లకు పరిపాలన అనుమతి. ఇది మొత్తం ప్రాజెక్టు వ్యయంలోనే సర్దుబాటు అవుతుంది.
6. మార్క్‌ఫెడ్ రూ.1800 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ లోన్ తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీకి క్యాబినెట్ ఆమోదం.
7. ఢిల్లీలోని 11.53 ఎకరాల స్థలంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించేలా రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి ఆమోదం. నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌బీసీసీకి అప్పగింత.
8. రాష్ట్రంలోని వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 2 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీల నుంచి మినహాయింపు. దీనివల్ల రూ.25 కోట్ల విలువైన ప్రాజెక్టులకు లబ్ధి.
9. పురపాలక సంఘాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజుకు సంబంధించి ఏకరీతి విధానం. ప్రతి ఏటా 7% అద్దె పెంచేలా నిబంధన.
10. కమర్షియల్ కాంప్లెక్స్‌లలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పోలిస్తే ఫస్ట్ ఫ్లోర్‌పై 20 శాతం, సెకండ్ ఫ్లోర్‌పై 30 శాతం తక్కువ అద్దె ఉండేలా నూతన విధానం.
11. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుకు సంబంధించి ఏకరీతి ఆటో మ్యూటేషన్ ఛార్జీల విధానానికి ఆమోదం.
12. కృష్ణా నది కుడిగట్టు (కరకట్ట) పటిష్టత, విస్తరణ పనులకు రూ.443 కోట్లతో సవరించిన అంచనాలకు ఆమోదం. గతంలో కాంక్రీట్ వాల్ కోసం వేసిన రూ.1304 కోట్ల అంచనాను రద్దు చేశారు.
13. అమరావతిలో సెక్రటేరియట్, హెచ్‌ఓడీ, జీఏడీ టవర్ల నిర్మాణంలో గ్లాస్ క్లాడింగ్, క్రౌన్, ఇతర పనుల కోసం రూ.2540 కోట్లకు పరిపాలన ఆమోదం.
14. అమరావతిలో 43 అంతస్తులతో రెండు క్వాంటం టవర్ల (ట్విన్ టవర్స్) షెల్ అండ్ కోర్ నిర్మాణానికి రూ.1208 కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్.
15. అసెంబ్లీ భవనం సెంట్రల్ స్పైర్, పార్కింగ్, అప్రోచ్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.798 కోట్లకు పరిపాలన అనుమతి.
16. ఉండవల్లి (జోన్-2) లేఅవుట్లలో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.580 కోట్లకు ఆమోదం.
17. సీఆర్‌డీఏ పరిధిలో ఎన్10-ఎన్13 జంక్షన్ల వద్ద అండర్‌గ్రౌండ్ కేబుల్ రీ-రూటింగ్ కోసం సవరించిన అంచనా రూ.1180.54 కోట్లకు ఆమోదం.
18. గతంలో రెవెన్యూ శాఖకు బదలాయించిన సీఆర్‌డీఏ భూములను (ఆర్-5 జోన్‌తో సహా) తిరిగి సీఆర్‌డీఏకు అప్పగించడానికి క్యాబినెట్ నిర్ణయం.
19. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద రైతుల కౌలు పెంపు, కటాఫ్ తేదీ పొడిగింపు వంటి అభ్యర్థనలకు ఆమోదం.
20. సీఆర్‌డీఏ భూ కేటాయింపులు: సెబీకి 1.5 ఎకరాలు.
21. స్వామినారాయణ గురుకులానికి పాఠశాల కోసం భూమి.
22. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు భూమి.
23. డీఏవీ పబ్లిక్ స్కూల్‌కు భూమి కేటాయింపులకు క్యాబినెట్ ఆమోదం.
24. పోలవరం నిర్వాసితులకు అదనపు ప్యాకేజీ కింద సొంతంగా ఇల్లు కట్టుకునే వారికి యూనిట్ ధర రూ.3.57 లక్షలకు పెంపు.
25. ఆర్అండ్ఆర్ కాలనీ బయట ఇల్లు కట్టుకునే వారికి హౌస్ సైట్ కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు.
26. పుష్కర ఎత్తిపోతల పథకంలో ఎస్కేప్ ఛానల్ నిర్మాణం కోసం రూ.4.71 కోట్లను నామినేషన్ పద్ధతిపై కేటాయించేందుకు ఆమోదం.
27. హంద్రీనీవా సుజల స్రవంతి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ పనులకు సవరించిన అంచనా రూ.309 కోట్లకు ఆమోదం.
28. తిరుపతి జిల్లా రేణిగుంటలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు కోసం సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్‌కు మార్కెట్ ధరకు 10 ఎకరాల భూమి కేటాయింపు.
29. కడప నగరంలో ఆధునిక డంపింగ్ యార్డ్ కోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు 92 ఎకరాల భూమి బదలాయింపు.
30. ప్రకాశం జిల్లాలో ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ హబ్ కోసం మార్కెట్ విలువకు 22 ఎకరాల భూమి.
31. చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో ఫ్రూట్ ప్యాకింగ్ యూనిట్ కోసం ఏపీ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు 13 ఎకరాల కేటాయింపు.
32. అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా)కి ఎంఐజీ లేఅవుట్ కోసం 11 ఎకరాల భూమికి ఆమోదం.
33. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ కోసం 'ఫిష్ ఇన్ ఇండియా' సంస్థకు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు ఇవ్వడానికి నిర్ణయం.
34. కాకినాడ అర్బన్‌లో కోర్టు కాంప్లెక్స్, నివాస భవనాల కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు.
35. విజయనగరం, ఒంగోలు, కర్నూలు, తూర్పుగోదావరి, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపు.
36. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ ట్రస్ట్ కోసం 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు ఇవ్వడానికి ఆమోదం.
37. కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నీటి సరఫరా పనుల కోసం ఏపీఐఐసీ తీసుకున్న రూ.75 కోట్ల రుణ ప్రతిపాదనకు రాటిఫికేషన్.
38. సత్యసాయి జిల్లాలో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఆర్డీవోకు దాదాపు 600 ఎకరాల భూమి కేటాయింపునకు సూత్రప్రాయ అంగీకారం.
39. బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సవరించిన అంచనా రూ.1586 కోట్లకు ఆమోదం.
40. కిసాన్ డ్రోన్ల వినియోగం కోసం మిగిలిన కేంద్ర నిధులను (దిరూ.14 కోట్లు) వాడుకునేందుకు పాత సంస్థకే కాంట్రాక్టు పొడిగింపు.
41. డిస్కంలు ఆర్ఈసీ నుంచి తీసుకునే రూ.7000 కోట్ల రుణానికి ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని పొడిగించడానికి క్యాబినెట్ ఆమోదం.

## ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి -

భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది.ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఏపీలోని దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితులు ఉండబోతున్నాయని వెల్లడించింది. వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.తెలంగాణ విషయానికి వస్తే... హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అయితే, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని అధికారులు తెలిపారు.

## మే 10న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన

మొదటిపేజీ తరువాయి - తెలియజేశారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారిగా తెలంగాణకు రానుండటంతో... ఈ పర్యటనపై అటు రాజకీయంగా, ఇటు పాలనాపరంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో రైల్వే వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే, ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు కూడా త్వరలోనే పట్టాలెక్కనున్నాయని వెల్లడించారు. వరంగల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రధాన మంత్రి కాకతీయ టెక్స్‌టైల్ పార్కు'ను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా మంజూరైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో ఇది ఒకటని చెప్పారు. ఈ పార్కు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రధాని పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభకు 3 లక్షల మందిని తరలించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

## నేటి నుండి అమల్లోకి గ్యాస్ సిలిండర్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ వరకు కొత్త రూల్స్!

మొదటిపేజీ తరువాయి - నేటి నుండి కొత్త నెల ప్రారంభం కాబోతోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా సామాన్యుడి దైనందిన జీవితం, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు చార్జీల వరకు, ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణల వరకు అనేక రంగాల్లో కొత్త నిబంధనలు అమలు కానున్నాయి. ఈ మార్పుల గురించి ముందుగా తెలుసుకోవడం బెటర్.ప్రతి నెలా మొదటి తేదీన చమురు మార్కెటింగ్ సంస్థలు గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తాయి. ఈ క్రమంలో మే 1న గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ల ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావం సాధారణ కుటుంబాల నుంచి హోటళ్లు, రెస్టారెంట్ల వరకు అందరిపైనా పడుతుంది.ఇకపై గ్యాస్ బుకింగ్ విషయంలో కూడా కొత్త నిబంధనలు రానున్నాయి. ఒకసారి సిలిండర్ బుక్ చేశాక, మళ్లీ బుక్ చేయడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల నిరీక్షణ కాలాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. దీంతోపాటు డెలివరీ ప్రక్రియలో భద్రతను పెంచేందుకు డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) విధానాన్ని తప్పనిసరి చేస్తున్నారు. ఇకపై సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుడు తమ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే, ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులు సబ్సిడీ ప్రయోజనాలు కొనసాగాలంటే, ఆధార్ ఆధారిత ఈ-కేవైసీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి. లేనిపక్షంలో సబ్సిడీ నిలిచిపోయే ప్రమాదం




ఉంది.దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ రేపటి నుంచి తమ క్రెడిట్ కార్డు నిబంధనలను సవరిస్తోంది. బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం లేట్ పేమెంట్ ఫీజులు, వార్షిక ఫీజు మినహాయింపు షరతుల్లో మార్పులు చేసింది. రూ. 100 నుంచి రూ. 500 మధ్య బకాయిలపై లేట్ పేమెంట్ చార్జి రూ. 100, రూ. 500 నుంచి రూ. 1,000 మధ్య బకాయిలపై రూ. 500 వరకు వసూలు చేయనున్నారు. కొన్ని కార్డులపై గతంలో ఏడాదికి రూ. 50,000 ఖర్చు చేస్తే లభించే వార్షిక ఫీజు మినహాయింపు పొందాలంటే, ఇకపై రూ. 1 లక్ష వరకు ఖర్చు చేయాల్సి రావచ్చు.ఎల్‌పీజీ మాదిరిగానే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) ధరలను కూడా నెల మొదటి రోజున సవరిస్తారు. ఈ ధరల పెంపు రవాణా ఖర్చులతో పాటు గృహ బడ్జెట్‌లపై కూడా ప్రభావం చూపుతుంది.'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్-2025' కింద రూపొందించిన 'ఆన్‌లైన్ గేమింగ్ రూల్స్ 2026' మే 1 నుంచి అమల్లోకి రావచ్చు. ఈ నిబంధనలను పర్యవేక్షించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఓజీఏఐ)' అనే కొత్త నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ చట్టం ప్రకారం గేములను మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. అవి: ఆన్‌లైన్ మనీ గేమ్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్. వయోపరిమితులు, తల్లిదండ్రుల నియంత్రణ (పేరెంటల్ కంట్రోల్స్), ఆర్థిక లావాదేవీలపై నిఘా వంటి కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయనున్నారు. ఈ నిబంధనలు దేశీయ, విదేశీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు వర్తిస్తాయి.నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ మార్పులు పారదర్శకతను పెంచి, వినియోగదారులకు మెరుగైన రక్షణ కల్పించేందుకు ఉద్దేశించినవి. కొన్ని నిబంధనలు మొదట్లో కొంత అసౌకర్యంగా అనిపించినా, దీర్ఘకాలంలో వ్యవస్థలను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా మారుస్తాయని భావిస్తున్నారు.

# వి. హనుమంతరావుకు కీలక పదవి

మొదటిపేజీ తరువాయి - కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. బీసీ వర్గాల గళంగా గుర్తింపు పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.వి. హనుమంతరావు గారిని రాష్ట్ర మంత్రి హోదాతో ఈ పదవిలో నియమించారు. దీని ప్రకారం ఆయనకు నెలకు రూ. 1,00,000 వేతనం అందనుంది. ఒకవేళ ప్రభుత్వ నివాసం కేటాయించకపోతే రూ. 50,000 ఇంటి అద్దె భత్యం (ఎ=రూా) పొందే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చుల కోసం రూ. 30,000 కన్వేయన్స్ అలవెన్స్, రూ. 15,000 ఇంధన ఖర్చులతో పాటు డ్రైవర్‌తో కూడిన ప్రభుత్వ వాహనాన్ని కూడా ప్రభుత్వం సమకూరుస్తోంది. వైద్య ఖర్చుల విషయంలో కూడా ఆయనకు అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులతో సమానమైన రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించారు.ఆయన కార్యకలాపాల కోసం బీసీ సంక్షేమ శాఖ ఒక ప్రైవేట్ సెక్రటరీ (పీఎస్), డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్‌తో కూడిన ప్రత్యేక సిబ్బందిని కేటాయించింది. దశాబ్దాలుగా బీసీ హక్కుల కోసం పోరాడుతున్న హనుమంతరావు అపారమైన అనుభవం... ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు దిశానిర్దేశం చేయడంలో కీలకం కానుంది. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో ఆయన సలహాలు ఇప్పుడు అధికారిక ముద్ర వేయనున్నాయి.సీనియర్ నేతలకు ఇలాంటి కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా అటు పార్టీలోనూ, ఇటు సామాజిక సమీకరణాల్లోనూ సమతుల్యత పాటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.



# ఏసీబీ వలలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

**పోడు రైతుపై ఒత్తిడి**

**రూ.10,000 తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

**డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో మెరుపు ఆపరేషన్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడి నిర్వహించి ఓ అటవీ శాఖ అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోడు రైతును వేధించకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఏసీబీ వలలో చిక్కాడు. గుండాల మండలం నడిమిగూడెం సెక్షన్‌కు చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నరేష్, సాయనపల్లి గ్రామానికి చెందిన పోడు రైతును ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు రూ.10,000 లంచం కోరాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు పన్నిన వ్యూహం ప్రకారం గురువారం నరేష్ నగదు స్వీకరిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడి ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని, లంచంగా తీసుకున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వై. రమేష్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రజల్లో అవినీతిపై అవగాహన పెరుగుతోందని తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఏసీబీని సంప్రదించాలని సూచించారు.

## క్లిష్టమైన శస్త్ర చికిత్సలకు నిలయంగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** మంథని మండలంలోని చల్లపల్లి గ్రామానికి చెందిన 29 సంవత్సరాల ఒక యువకుడు ఈ నెల 16 రాత్రి 10 గంటలకు రోడ్డు ప్రమాదంలో తన బైక్ పై నుంచి డివైడర్ కు ఢీ కొనడం జరిగింది. ఈ ప్రమాదంలో అతని కుడి చేయి తీవ్రంగా గాయపడి, తీవ్ర రక్త స్రావం జరిగింది, ఆ యువకుడు వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె శ్రీధర్ కి ఫోన్ చేసి విషయం చెప్పగా,వెంటనే స్పందించిన సూపరింటెండెంట్ ఆ యువకుడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రమ్మని చెప్పి, హుటాహుటిన జనరల్ సర్జరీ డాక్టర్ విష్ణు చంద్రికను పిలిపించి, లోతుగా అయిన గాయాలకు శస్త్ర చికిత్స నిర్వహించి,రక్త స్రావాన్ని ఆపారు.తర్వాత సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా.కంది శ్రీనివాస్ రెడ్డి మరియు డా. వినయ్,వీరితో పాటు మత్తు వైద్యురాలు డా. భవాని సదరు యువకుడికి కండరాలు ,నరాలు,రక్త నాళాలను అత్యంత నైపుణ్యంతో 3 గంటలు శ్రమించి శస్త్ర చికిత్స నిర్వహించారు. సదరు పేషెంట్ ను పూర్తిగా కోలుకున్న అనంతరం నిన్న డిశ్చార్జ్ చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,వైద్య బృందాన్ని అభినందించారు .

## నాలుగు మండలాల వ్యవసాయ అధికారులతో కొలికపూడి సమీక్షా సమావేశం...




**తిరువూరు,ఏప్రిల్ 30(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం.** తిరువూరు ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం నందు తిరువూరు నియోజకవర్గం లో గల నాలుగు మండలాల వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే కొలికపూడి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ



సమావేశంలో రైతులకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ధాన్యం సేకరణ ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల పనితీరు, రైతులకు ఎదురవుతున్న సమస్యలు గురించి సమగ్రంగా సమీక్షించారు. ప్రధానంగా,ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు ఉన్నాయా అనే అంశం,రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేయడం, ధాన్యం నిల్వ కోసం గోదాములు సరిపడా ఉన్నాయా అనే అంశం పరిశీలన,లారీలు సమయానికి అందుబాటులో లేక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చిశీచారు.గన్నీ బ్యాగుల కొరతపై సమీక్షా మరియు రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధేసించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు,కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే సమయం తగ్గించడం,తాగునీరు, షెడ్లు, తాత్కాలిక వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, రైతులకు సరైన సమాచారం అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం మోధలగు వాటీ గురించి చర్చిశీచారు.రైతు సమస్యలను అత్యవసరంగా పరిగణించి వెంటనే పరిష్కరించాలినీ, ఎక్కడైనా నిర్లక్ష్యం ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండలంలో పరిస్థితులను రోజువారీగా మానిటరింగ్ చేయాలని అయన ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలని స్పష్టం చేశారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో పనులు జరపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుండి ప్రారంభం

**జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద**

**ఫెయిలైన విద్యార్థులు గడువు లోపు ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించాలి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30( వార్త సంధ్య) :** పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుండి ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ధికారి జి. శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పదవ తరగతి మార్చి 2026 పరీక్షల ఫలితాల అనంతరం ఫెయిలైన విద్యార్థుల కోసం నిర్వహించబడే ఎస్ఎస్సి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుండి జూన్ 12, 2026 వరకు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించ బడతాయని, పరీక్షల నిర్వహణకు సమయం పరిమితంగా ఉన్నందున రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను వేచి చూడకుండా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని, మార్చి 2026 ఎస్ఎస్సి పరీక్షల్లో ఫెయిల్ అయినవారు,అలాగే 2015 సీసీఈ ప్యాటర్న్‌లో ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు.అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్లైన్ (సైబర్ ట్రీసురీ ) ద్వారా చెల్లించాలని సూచించారు. పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియ ఏప్రిల్ 30 నుండి ప్రారంభమై మే 14వరకు కొనసాగుతుందని తెలిపారు.హెడ్ మాస్టర్లు ఈ-ఎన్ఆర్ ను మే 15లోపు జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని,జిల్లా విద్యాధికారులు ఆర్ఆర్ ను మే16లోపు ప్రభుత్వ పరీక్షల కార్యాలయానికి ఆన్లైన్ ద్వారా పంపించాలని పేర్కొన్నారు.ఆలస్య రుసుము రూపాయలు 50తో సంబంధిత సబ్జెక్టు పరీక్ష ప్రారంభానికి 2 రోజుల ముందు వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని, అభ్యర్థులు గడువులను కచ్చితంగా పాటించి సమయానికి ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# హామీలు ఎక్కడ..? ఉద్యోగుల ఆగ్రహం ఉవ్వెత్తున

**మే 5 న టిజిఈజెఏసి నిరాహార దీక్ష ప్రకటన"**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మే 5వ తేదీన జరిగే ఒకరోజు సామూహిక నిరాహార దీక్షల విజయవంతం కొరకు సన్నాహక సమావేశం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ కొత్తగూడెం నందు బుధవారం నాడు టిజిఈజెఏసి చైర్మన్ అమరనేని రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పెండింగ్ సమస్యల పరిష్కారం కొరకు మే 5వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఐడిఓసి వద్దగల ధర్నా చౌక్ నందు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఒకరోజు సామూహిక నిరాహార దీక్షలు చేయనున్నట్లు టిజిఈజెఏసి చైర్మన్ అమరనేని రామారావు, జేఏసీ కన్వీనర్ సంఘం వెంకట పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకి రావలసిన ఆర్థిక ప్రయోజనాలన్నీ కూడా ఎంతో కాలం నుండి పెండింగ్లో ఉన్నాయని వీటన్నిటిని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు, ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన పిఆర్సి రిపోర్టులు వెంటనే తెప్పించుకొని జూన్ రెండవ తేదీ నుండి అమలు చేయాలని కోరారు, ఎంతోకాలంగా సిపిఎస్ రద్దు కొరకు ఎదురుచూస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు, అదేవిధంగా పెండింగ్లో ఉన్న ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెన్షనర్లకు సంబంధించిన పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ఇవ్వాల్సిన హెల్త్ కార్డులను వెంటనే అమలు జరపాలని కోరారు. నేడు ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో కాలంగా తమ పిఎఫ్ అకౌంట్లలో దాచుకున్న సొమ్ము కూడా ఇవ్వకుండా సంవత్సరాలు గా కాలయాపన చేస్తున్నారని, ఇది సరైనది కాదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాలో ఉపాధ్యాయ ఉద్యోగులకు పెన్షనర్లకు సంబంధించిన బిల్లులు దాదాపు పది పదివేల కోట్లకు పైగా పెండింగ్లో ఉన్నాయని వీటన్నింటినీ ఏక మొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో పాటు రాష్ట్రంలో ఇంకా జీతాలు మొదటి తేదీన రాకుండా ఉన్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మొదటి తారీకున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు 64 డిమాండ్లు ప్రభుత్వానికి ఇచ్చిన మెమొరండంలో ఉన్నాయని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సభ్య సంఘాల నాయకులు టీఎస్ యుటిఎఫ్ నుండి రాష్ట్ర కార్యదర్శి బి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, పిఆర్టియు టీఎస్ నుండి నరసయ్య, పిఆర్టియు టీజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకటేశ్వర్రావు, జిల్లా అధ్యక్షులు బి రవి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరావు, సిపిఎస్ ఉపాధ్యాయుల నుండి టి శ్రీనివాసరెడ్డి, ట్రెస్సా నుండి పుల్లయ్య గారు, టిజిఓ సెక్రెటరీ మహేష్ గారు, డ్రైవర్ల సంఘం నుండి శ్రీనివాస్ గారు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ అసోసియేషన్ నుండి కామేష్ గారు, జూనియర్ లెక్చరర్ల సంఘం నుండి వెంకటేశ్వర్లు గారు, పెన్షనర్ల సంఘం నుండి వెస్లీ గారు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నుండి దినేష్ మహిళా ప్రతినిధులు, విజయలక్ష్మి, రాణి ,ఉష, రెవెన్యూ క్లాస్ ఫోర్ నుండి రామ్ రవి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నుండి నాగేశ్వరరావు, ఎంపీడీవోల సంఘం నుండి శ్రీనివాస్ గారు, , తదితరులు పాల్గొన్నారు

# హక్కుల కోసం రగిలిన చరిత్ర.. మే డే ఆవిర్భావం

**చికాగో ఉద్యమం నుంచి ప్రపంచ కార్మిక ఐక్యత దిశగా ప్రయాణం**

**కష్టజీవుల కృషికి కృతజ్ఞతగా మే 1 వేడుకలు**

**8 గంటల పనికి మొదలైన ఉద్యమం..**

**హక్కుల సాధనకు ప్రపంచవ్యాప్త సంకల్పం**

**నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే)**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 1న జరుపుకునే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మీుం ఋం) కార్మికుల కష్టానికి, వారి హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచింది. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అపారమైనది. పరిశ్రమలు, వ్యవసాయం, నిర్మాణ రంగం, సేవా రంగంప్రతి విభాగంలో కార్మికుల శ్రమే అభివృద్ధికి బలమైన పునాది. అలాంటి కార్మికుల కృషిని గౌరవించడంతో పాటు, వారి హక్కుల పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేసే రోజే మే డే. ఈ దినోత్సవం వెనుక గొప్ప చరిత్ర ఉంది. 19వ శతాబ్దం చివర్లో అమెరికాలోని పరిశ్రమల్లో కార్మికులు రోజుకు 12 నుంచి 16 గంటలపాటు పని చేయాల్సి వచ్చేది. తక్కువ వేతనాలు, భద్రతలేమి, కఠినమైన పని పరిస్థితులు కార్మికులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేశాయి. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా "రోజుకు 8 గంటల పని" అనే నినాదంతో 1886 మే 1న చికాగో నగరంలో భారీ సమ్మెలు ప్రారంభమయ్యాయి. మే 4న జరిగిన హేయ్‌మార్కెట్ సంఘటనలో బాంబు పేలుడు జరగడంతో హింస చెలరేగి పలువురు కార్మికులు, పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ కార్మిక ఉద్యమానికి మలుపు తిప్పింది. తరువాత 1889లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశంలో మే 1ను కార్మిక దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచంలోని అనేక దేశాలు ఈ రోజును అధికారికంగా జరుపుకుంటున్నాయి. ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా కార్మికుల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. భారతదేశంలో మే డే మొదటిసారి 1923లో చెన్నైలో జరుపుకున్నారు. లేబర్ కిసాన్ పార్టీ నాయకుడు సింగరావేలు చెట్టియార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు మే 1న వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్మిక హక్కుల కోసం తమ గొంతును వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో కార్మిక రంగం కూడా కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. గిగ్ ఎకానమీ, కాంట్రాక్ట్ ఉద్యోగాలు, ఆటోమేషన్, వేతన అసమానతలు వంటి అంశాలు కార్మికుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో మే డే కేవలం చారిత్రక సంఘటనలకే పరిమితం కాకుండా, నేటి కార్మికుల సమస్యలను చర్చించేందుకు ఒక వేదికగా మారింది. కార్మికుల శ్రమకు గౌరవం, సముచిత వేతనం, సురక్షితమైన పని వాతావరణం, సామాజిక భద్రతఇవన్నీ ప్రతి కార్మికుడికి లభించాలి అనే సందేశాన్ని మే డే మళ్లీ మళ్లీ గుర్తు చేస్తోంది. సమాజ అభివృద్ధి కోసం కార్మికుల సంక్షేమం అత్యవసరం అనే సత్యాన్ని ఈ రోజు స్పష్టం చేస్తుంది.

## కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసేంతవరకు పోరు కొనసాగుతుంది

**ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసూఫ్**

**సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పై మే రెండో వారంలో సమ్మె నోటీసు ఇస్తాం**

**గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్ కుమార్ లు**






**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, గోదావరిఖని, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసి, కార్మికుల కు నష్టం కల్గించే విధంగా ఏప్రిల్ లో అమలు లోకి తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కోసం మే డే స్ఫూర్తితో ఉద్యమాలను నిర్వహిస్తామని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసూఫ్ అన్నారు. బుధవారం రాత్రి గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల అమలు జరిగితే దాని వల్ల కలిగే కష్టనష్టాలను వివరించారు. ముఖ్యంగా పని గంటలు పెరుగుతాయని,జీతాల పెంపు యాజమాన్యం దయా దాక్షిణ్యాల పై ఆధారపడి ఉంటుందని, ఉద్యోగ భద్రత ఉండదని ఆయన అన్నారు, లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడే ఉత్సవాల్లో ప్రతిన బూనాలని ఆయన కార్మికులకు పిలుపు నిచ్చారు.సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు మాట్లాడుతూ మెడికల్ బోర్డు పునరుద్ధరణ, మారుపేర్ల అంశం కార్మికులకు ప్రమోషన్ సహా సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను మే మొదటి వారంలోగా పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని రెండో వారంలో సమ్మెకు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి,సిపిఐ నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజ్, మాదన మహేష్, సంకె అశోక్,బోగ సతీష్ బాబు, పి.విజయ లక్ష్మి, ఎంఎ.గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎండల వేళ చలివేంద్రంతో సేవా కార్యక్రమం


**విద్యానగర్‌లో భారతీ చారిటబుల్ ట్రస్ట్ ముందడుగు**

**బాటసారులకు మజ్జిగ, లస్సీ పంపిణీ**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో భారతీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి సుభాషిని హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తీవ్ర ఎండల సమయంలో ప్రజలు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే చలివేంద్రాలు బాటసారులు, ప్రయాణికులకు నీటి అవసరాన్ని తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ట్రస్టీలు భారతీ, మధు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాటసారులకు మజ్జిగ, లస్సీ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

## ఎమ్మెల్యే కార్యాలయం నందు వి.ఓ.ఏ.లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ..



**తిరువూరు,ఏప్రిల్ 30 (వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం.** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కార్యాలయం నందు గంపలగూడెం,ఏ. కొండూరు, విస్సన్నపేట మండలాల కి సంభందించిన వి.ఓ.ఎ లకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు 2వ విడత స్మార్ట్ 61 ఫోన్లు పంపిణీ చెసారు.ఈ కార్యక్రమం లో ఏ.పీ.ఎం లు, సీ.సీ లు,వి.ఓ.ఎ లు మండల సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరిసిన విద్యా కుసుమం..



**ఎ కొండూరు,ఏప్రిల్ 30 (వార్త సంధ్య):- ఎన్టీఆర్** జిల్లా,తిరువూరు నియోజకవర్గం. 581 మార్కులతో మండల టాపర్‌గా అనూష ఘనత ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రతిభకు కొదవలేదని మరోసారి నిరూపిస్తూ ఎ.కొండూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన విద్యార్థిని మోటూరి అనూష పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. గ్రామానికి చెందిన మోటూరి రాంబాబు, సుజాత దంపతుల కుమార్తె అయిన అనూష, గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 581 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అనూష క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఈ విజయం సాధించడం గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలిచింది. తాను భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడమే తన లక్ష్యమని అనూష తెలిపింది. తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమని ఆమె పేర్కొంది.మండలంలో తొలి స్థానం సాధించిన అనూషను మండల తహసీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొజ్జగాని శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి ఈఎల్వీ కేశవరావు అభినందించారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, రోజారాణి దంపతులు కూడా అనూషను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అనూష విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుత ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.

## శ్రీనిధి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ..



**తిరువూరు, ఏప్రిల్ 30(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం.** 20252026 ఎస్.ఎస్.సి. ఫలితాల్లో స్థానిక శ్రీనిధి హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. టి. రమ్య శ్రీ 591 మార్కులతో డివిజన్ సెకండ్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇతర విద్యార్థులు జి. జోషిత (585), వి. ధరణి (582), బి. ప్రణతి (578), షేక్ కౌసర్ (575), యన్. షణ్మిత్ (574) మంచి మార్కులు సాధించారు.అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ముత్యాల కిషోర్ బాబు, డైరెక్టర్ బొంతు మహేశ్వరరావు, ప్రిన్సిపల్ ఆర్ వెంకట్ నారాయణ, హయ్యర్ ఇంచార్జి పి.డి. సునీల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇల్లు లబ్ధిదారికి అభినందనలు

**ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల సాకారం**

**ఇతరులకు ఆదర్శంగా నిలిచిన చింతల అనసూర్య**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారురాలు చింతల అనసూర్య నివాసాన్ని మండల ఎంపీడీవో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తక్కువ వ్యయంతో సుమారు రూ.6 లక్షల లోపే ఇల్లు పూర్తి చేయడం విశేషమని అధికారులు అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఇతర లబ్ధిదారులకు ఆదర్శంగా నిలిచినట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు అనసూర్యను ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలిపారు. తక్కువ ఖర్చుతోనూ నాణ్యతతో ఇల్లు నిర్మించడం ద్వారా ఇతర లబ్ధిదారులకు ప్రేరణ కలిగిందని చెప్పారు. ఇలాంటి మంచి ఉదాహరణలను గ్రామంలో ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు సొంత ఇంటి కల నెరవేరుతోందని, లబ్ధిదారులు సమయానికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్పందన, హౌసింగ్ ఏఈ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్‌లో ఇందిరమ్మ ఇండ్లపై కీలక సమీక్షలో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం, హిమాయత్ నగర్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.సమీక్షలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల వేగవంతం, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన మంజూరు, భూమి సమస్యలు, పరిపాలనా ఆటంకాలు, ఫీల్డ్ స్థాయి అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. పనులు ఆలస్యం కాకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.సమావేశంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మకాన్ సింగ్ రాజ్ ఠాగూర్, ఎమ్మెల్యే విప్ విజయ రమణారావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రటరీ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా సమగ్ర కార్యాచరణ అవసరమని సూచించారు. అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేసి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలు సన్మాన కార్యక్రమం

**దళిత రత్నా అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న**

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో గురువారం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన దళిత రత్నా అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన అవార్డులను ప్రదానం చేశారు. సమాజ సేవ, విద్య, సామాజిక చైతన్యం రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులను ఈ అవార్డులతో సత్కరించారు. అవార్డు గ్రహీతలను అభినందించిన ఎంపీ వంశీకృష్ణ , మహనీయుల ఆశయాలు సమాజంలో ప్రతిబింబించాలంటే ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మన దళితులు అందరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, ముఖ్యంగా ఐఏఎస్ , ఐపీఎస్ వంటి ఉన్నత సేవల్లో చేరాలని పిలుపునిచ్చారు. చదువు ద్వారానే సమాజంలో గౌరవం, అవకాశాలు, స్వాభిమానాన్ని పొందగలమని ఆయన పేర్కొన్నారు.

## కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు

**రైతుల పక్షపాతి రేవంత్ రెడ్డి సర్కార్**

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (వార్త సంధ్య ) :** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని భుర్హనిమియాపేట, సుల్తాన్పూర్, ముప్పిరితోట, ర్యాకలదేవుపల్లి గ్రామాల్లో గురువారం రోజున సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు రైతులు కొనుగోలు కేంద్రాలలో అష్ట కష్టాలు పడ్డారని, ఇప్పుడు అన్నదాతకు ఏ చిన్న ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామని,ఈ ప్రభుత్వంలో రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఒక్క సారి ఆలోచన చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, పెద్దపల్లి నియోజకవర్గంలో తాను సైతం రైతులకు ధాన్యానికి గింజ కటింగ్ లేకుండా చేస్తూ రైతుల కోసమే నిరంతరం పాటు పడుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు మరియు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మే డే పోరాట స్ఫూర్తితో కార్మిక లోకం ఐక్యం కావాలి

**జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఎర్రజెండా రెపరెపలాడాలి**

**శ్రామిక అడ్డాలు, బస్తీలు, గ్రామాల్లో మే డేను పండుగలా నిర్వహించాలి**

**చికాగో అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి**

**ఎనిమిది గంటల పనిదినం కోసం సాగిన చారిత్రిక పోరాటాన్ని చాటిచెప్పుదాం**

**హక్కుల సాధన కోసం కార్మిక వర్గం ఉద్యమాల ఉధృతిని పెంచాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (వార్త సంధ్య) :** మే డే పోరాట స్ఫూర్తితో కార్మిక లోకం అంతా ఐక్యం కావాలని, జిల్లావ్యాప్తంగా ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 1వ తేదీన జిల్లాలోని కార్మిక క్షేత్రాలు, శ్రామిక అడ్డాలు, బస్తీలు, గ్రామాలు, పార్టీ మరియు యూనియన్ కార్యాలయాలతో పాటు సింగరేణి బొగ్గుగనుల పరిధిలో ఎర్రజెండాను ఎగురవేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పనిదినం కోసం చికాగో నగర వీధుల్లో కార్మికులు చిందించిన రక్తం వృధా కాలేదని, ఆ పోరాట ఫలితమే నేడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులని గుర్తు చేశారు. పెట్టుబడిదారీ వర్గాల అణచివేతను ఎదిరించి, శ్రమశక్తి విలువను ప్రపంచానికి చాటిచెప్పిన రోజు మే డే అని కొనియాడారు. 1886లో అమెరికాలోని చికాగోలో కార్మికులు చేసిన ఆందోళనలు ప్రపంచ చరిత్రనే మార్చివేశాయని, నాటి పోరాట స్ఫూర్తి నేటికీ శ్రామిక వర్గానికి దిశానిర్దేశం చేస్తోందని అన్నారు. గాలి, నీరు లేని చీకటి గనుల్లో పనిచేసే బొగ్గు గని కార్మికుల నుండి, ఎండనక వాననక రెక్కలు ముక్కలు చేసుకునే వ్యవసాయ కూలీల వరకు అందరికీ మే డే ఒక ఆత్మగౌరవ ప్రతీక అని పేర్కొన్నారు. ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, యజమానులకు కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. కష్టజీవుల హక్కులను కాలరాసే ఏ శక్తినైనా ఎర్రజెండా ముందు తలవంచాల్సిందేనని హెచ్చరించారు. కార్మికుల మధ్య చీలికలు తెచ్చే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి, సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. బానిసత్వం నుండి విముక్తి పొంది, గౌరవప్రదమైన జీవితం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ, ప్రతి పని ప్రదేశంలోనూ మే డే వేడుకలను నిర్వహించి, ర్యాలీలు మరియు సదస్సుల ద్వారా కార్మికులను చైతన్యపరచాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్మిక హక్కుల రక్షణ కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని, ఈ మే డే వేడుకలు ఆ పోరాటాలకు పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, కందుల భాస్కర్, గెడ్డాడు నగేష్, గౌనె మణి తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద పార్కులో పర్యాటించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,ఏప్రిల్ 30:** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్.జీ.ఓస్ కాలనీలో ఉన్న స్వామి వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వివేకానంద పార్కును సందర్శించారు.ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పార్కులో పర్యటించారు. పార్క్ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా యోగ షెడ్ నిర్మాణం,అసోసియేషన్ భవనానికి రంగులు వేయడం,టాయిలెట్ల మరమ్మతులు మరియు మహిళల కోసం ప్రత్యేక టాయిలెట్లు,ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు,వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణం,ఓపెన్ జిమ్ పునర్నిర్మాణం,మంచినీటి సదుపాయం,నూతన బోర్ కనెక్షన్ కల్పించడం వంటి అంశాలను కోరారు.అదేవిధంగా పార్కులో చెత్త చెదారం పేరుకుపోవడం,కుక్కలు విపరీతంగా సంచరిస్తున్న సమస్యలను ప్రస్తావిస్తూ,కుక్కలు లోపలికి రాకుండా పార్క్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పార్క్ బయట గోడలకు స్టిక్కర్లు అంటించకుండా చూడాలని కోరారు.ఈ సమస్యలపై స్పందించిన సుధీర్ రెడ్డి వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే టాయిలెట్స్,పార్క్ ఫెన్సింగ్,వాకింగ్ ట్రాక్, నూతన బోర్ కనెక్షన్,తదితరపలు అంశాల మీద సంబంధించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే నూతన యోగ షెడ్డు నిర్మాణం కోసం కటిక రెడ్డి అరవింద్ రెడ్డి ముందుకు రావడం చాలా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,మాధవరం నరసింహారావు,మనోజ్,భాస్కర్,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంచిరెడ్డి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్ రెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణ, జాయింట్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, రవిశంకర్, వీరాస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, అడ్వైజర్స్ మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు జంగారెడ్డి, జంగయ్య, సుధాకర్ రెడ్డి, సభ్యులు తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోన్ మాయలో లక్షా పాతిక వేల దోపిడి

**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, ఏప్రిల్ 30:** నాగోల్‌లో సైబర్ మోసం తక్కువ వడ్డీతో లోన్ ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి ఒక ఉపాధ్యాయుడిని లక్షా పాతిక వేల రూపాయలతో మోసం చేసిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో ఈ ఘటన మరోసారి ప్రజలను అప్రమత్తం చేస్తోంది. పోలీసుల కథనం ప్రకారంఢ నాగోల్ సాయినగర్ కాలనీకి చెందిన కొప్పుల లింగ రెడ్డి (46), ఉపాధ్యాయుడు, ఈ నెల 2వ తేదీన ఉదయం ఒక అనామక కాల్ అందుకున్నారు. కాల్ చేసిన వ్యక్తి తాను ఐసిఐసిఐ బ్యాంక్ నానక్రామ్ గూడ బ్రాంచ్ నుండి మాట్లాడుతున్నానని చెప్పి, తక్కువ వడ్డీతో పెద్ద మొత్తంలో లోన్ అందిస్తానని హామీ ఇచ్చాడు. ఇప్పటికే ఇతర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని, లోన్ అవసరం లేదని బాధితుడు చెప్పినప్పటికీ, ప్రస్తుత లోన్లను క్లోజ్ చేసి మరింత తక్కువ వడ్డీతో కొత్త లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. తనను "ప్రదీప్"గా పరిచయం చేసుకున్న ఆ మోసగాడు, బాధితుడి సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని పేర్కొంటూ, ప్రాసెసింగ్ ఛార్జీలు, డాక్యుమెంట్ ఫీజుల పేరుతో రూ.1,25,000 చెల్లించాలని కోరాడు. నమ్మకంగా మాట్లాడటం, బ్యాంక్ ఉద్యోగి లాగా ప్రవర్తించడం వల్ల బాధితుడు అతని మాటలను నమ్మి, తన వ్యక్తిగత వివరాలను వాట్సాప్ ద్వారా పంపించాడు. ఆ తర్వాత మోసగాడి సూచనల మేరకు మూడు విడతలుగా డబ్బులు బదిలీ చేశాడు. ఏప్రిల్ 7న తన భార్య ఖాతా నుండి రూ.50,000, ఏప్రిల్ 14న మరో రూ.50,000, ఏప్రిల్ 28న తన ఖాతా నుండి రూ.25,000 ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశారు. మొత్తం డబ్బు అందుకున్న తర్వాత మోసగాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, వాట్సాప్ నంబర్ కూడా అందుబాటులో లేకుండా పోయింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయించుకున్నారు. అనంతరం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు ఇవ్వగా, పోలీసులు కేస్ నమోదు చేసినారు ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జాని మాట్లాడుతూ, నిందితుడిని గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

## శ్రీ రామానుజన్ విద్యాసంస్థల ప్రభంజనం

## 100% ఉత్తీర్ణతతో రికార్డు విజయం




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, ఏప్రిల్ 30:** హయత్ నగర్, హైదరాబాద్‌లోని శ్రీ రామానుజన్ విద్యాసంస్థలు విద్యారంగంలో మరో అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. తాజాగా విడుదలైన ఎస్.ఎస్.సి–2026 ఫలితాల్లో మా విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి, సంస్థ ప్రతిష్టను మరోసారి నిలబెట్టారు. ఈ అద్భుతమైన విజయానికి ప్రధాన కారణం మన విద్యార్థుల కఠోర శ్రమ మరియు ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వం. ఈ విజయోత్సవంలో పాల్గొన్న వారిలో ముఖ్యులు: చైర్మన్: బి. పుచందర్ రావు, డైరెక్టర్: శ్రీమతి సరిత, జోనల్ ఇన్చార్జ్: శ్రీమతి బి. పద్మావతి, ప్రిన్సిపాల్: జి. వెంకట్ రెడ్డి సంస్థలో అత్యధికంగా 585/600 మార్కులతో బి. సచిత ప్రథమ స్థానంలో నిలిచారు. వీరితో పాటు అనేకమంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. "నాణ్యమైన విద్య – మానవ నైపుణ్యం" లక్ష్యంగా,ఐ.ఐ.టి,జె.ఈ.ఈ మరియు నీట్ ఫౌండేషన్ కోర్సుల్లో అత్యుత్తమ శిక్షణనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాము. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారిని తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు మరియు అధ్యాపక బృందానికి హృదయపూర్వక అభినందనలు.

## తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ

**32 ఏళ్లపాటు పోలీసు అధికారిగా సేవలందించిన శివధర్ రెడ్డి**

**పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్ లో గౌరవ వందనం**

**సామాన్యులకు పోలీసులను దగ్గర చేయడంలో ఎంతో సాధించామన్న శివధర్ రెడ్డి**



తెలంగాణ పోలీస్ శాఖలో మరో చిరస్మరణీయ అధ్యాయం ముగిసింది. సుమారు 32 ఏళ్ల పాటు నిష్కళంకమైన సేవలు అందించిన డీజీపీ బి.శివధర్ రెడ్డి నేడు పదవీ విరమణ చేశారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్ లో గౌరవ వందనాన్ని నిర్వహించారు. సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ... 1970–80ల నాటి కఠినమైన పోలీసింగ్ పద్ధతుల నుంచి నేటి ఆధునిక, సిటిజన్ ఫ్రెండ్లీ విధానాల వరకు సాగిన పరిణామ క్రమాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో పోలీసులపై ఉన్న అపవాదులను తుడిచివేసి, సామాన్య ప్రజలకు పోలీసులను దగ్గర చేయడంలో ఎంతో సాధించామని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలతో ఏర్పడిన దూరాన్ని తగ్గించి, విశ్వసనీయతను పెంచామని చెప్పారుతన స్వరాష్ట్రానికి డీజీపీగా సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పోలీస్ శాఖను తీర్చిదిద్దిన తృప్తితో తాను విధులకు వీడ్కోలు పలుకుతున్నట్లు చెప్పారు. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న సి.వి. ఆనంద్ ను ఒక సమర్థవంతమైన అధికారిగా ఆయన అభివర్ణించారు.

## గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు .. 50 లక్షల సరుకు స్వాధీనం

**అనకాపల్లి జిల్లాలో భారీ గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు**

**ఒడిశా నుంచి కాకినాడకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు**

**50 కిలోల గంజాయి స్వాధీనం.. ఐదుగురు నిందితుల అరెస్ట్**

**సుమారు రూ. 50 లక్షల విలువ ఉంటుందని అంచనా**

**నిందితుల నుంచి కారు, బైకులు, సెల్‌ఫోన్లు సీజ్**



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పరిధిలో భారీ గంజాయి స్మగ్లింగ్‌ను పోలీసులు భగ్నం చేశారు. ఒడిశా నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకు అందిన పక్కా సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలోని బృందం కేడీపేట సమీపంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ముఠా పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ మార్కెట్‌లో సుమారు రూ. 50 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.అరెస్ట్ అయిన నిందితులను కాకినాడకు చెందిన తేజ్ కిరణ్, చందు, సింహాద్రి, అరవింద్, విగ్నేష్‌గా గుర్తించారు. వీరి నుంచి ఒక కారు, మూడు బైకులు, ఐదు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## డీజే సౌండ్‌కు తట్టుకోలేక 140 కోళ్లు మృతి!

**యూపీలోని సుల్తాన్‌పూర్ జిల్లాలో ఘటన**

**పెళ్లి ఊరేగింపులో అధిక శబ్దంతో డీజే**

**ఆ సౌండ్ వల్ల తన కోళ్లు మరణించాయని యజమాని ఫిర్యాదు**

**డీజే ఆపరేటర్‌పై కేసు నమోదు**

ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఒక విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. పెళ్లి ఊరేగింపులో పెట్టిన డీజే సౌండ్‌కు తట్టుకోలేక 140 కోళ్లు చనిపోయాయని ఓ పౌల్ట్రీ ఫామ్ యజమాని ఆరోపించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు డీజే ఆపరేటర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సుల్తాన్‌పూర్ జిల్లా బల్దిరాయ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దరియాపూర్ గ్రామంలో సబీర్ అలీ అనే వ్యక్తి పౌల్ట్రీ ఫామ్ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 25వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో బబ్బన్ విశ్వకర్మ కుమార్తె వివాహ ఊరేగింపు ఆయన ఫామ్ మీదుగా వెళ్లింది. ఈ ఊరేగింపులో డీజే నుంచి వచ్చిన తీవ్రమైన శబ్దానికి ఫారంలోని కోళ్లు భయంతో వణికిపోయాయని సబీర్ అలీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ సౌండ్‌కు తట్టుకోలేక 140 కోళ్లు మృతి చెందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సబీర్ అలీ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. డీజే ఆపరేటర్ కవి యాదవ్‌పై కేసు నమోదు చేశారు. బల్దిరాయ్ ఎస్‌హెచ్‌వో మహేంద్ర ప్రతాప్ సింగ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అనుమతించిన పరిమితిని మించి సౌండ్ పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. కోళ్ల మృతికి నిజంగా డీజే సౌండే కారణమా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాన్ని పోలీసులు తేల్చనున్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం.. నిందితులకు ఊరట

**ముగ్గురు నిందితులకు తాత్కాలిక ఊరట కల్పించిన హైకోర్టు**

**జూన్ 24 వరకు నిందితులను అరెస్ట్ చేయొద్దని ఉత్తర్వులు**

**కౌంటర్లు దాఖలు చేయాలని సిట్ అధికారులకు ఆదేశం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితులకు హైకోర్టులో ఊరట లభించింది. నిందితులైన ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం పొడిగించింది. ఈ కేసు విచారణలో భాగంగా నిందితులు ముగ్గురినీ జూన్ 24వ తేదీ వరకు అరెస్టు చేయవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులు తమపై నమోదైన కేసులకు సంబంధించి దాఖలు చేసిన పిటిషన్లపై ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.ఇదే సమయంలో, ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) కూడా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నిందితుల పిటిషన్లపై వచ్చే నెల 6వ తేదీలోగా కౌంటర్లు దాఖలు చేయాలని సిట్ అధికారులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.




హైకోర్టు తాజా ఉత్తర్వులతో నిందితులకు అరెస్టు నుంచి తాత్కాలికంగా రక్షణ లభించినట్లయింది.

# డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్.. మావోయిస్టులపై కీలక వ్యాఖ్యలు

**శివధర్ రెడ్డి నుంచి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్**

**పోలీసు శాఖ అత్యుత్తమ సంప్రదాయాలను కొనసాగిస్తానని వ్యాఖ్య**

**శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడబోమన్న నూతన డీజీపీ**




తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్న అనంతరం, ఆయన తన ప్రాధాన్యతలను స్పష్టంగా వివరించారు. తనపై నమ్మకం ఉంచి అత్యున్నత బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూనే, తెలంగాణ పోలీసులు దశాబ్దాలుగా పాటిస్తున్న అత్యుత్తమ సంప్రదాయాలను కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ యంత్రాంగాన్ని మరింత ఆధునీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.దేశంలో నక్సలిజం సమస్య అంతిమ దశకు చేరుకున్న తరుణంలో, పోలీసుల కార్యాచరణలో కూడా మార్పులు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాలు నక్సలిజాన్ని కట్టడి చేయడంలో దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. కేవలం అణచివేత ధోరణి కాకుండా, లొంగిపోయిన మావోయిస్టులకు మెరుగైన పునరావాసం కల్పించడం, వారికి ఉపాధి మార్గాలు చూపడం వంటి సామాజిక కోణంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన విశ్లేషించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా, ప్రజల భద్రతే పరమావధిగా పనిచేసి తెలంగాణ పోలీస్ శాఖ ఖ్యాతిని మరింత పెంచుతానని ఆయన స్పష్టం చేశారు.

# మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 15 మంది కూలీల దుర్మరణం

**కూలీలతో వెళ్తున్న పికప్ వ్యాన్ బోల్తా**

**అతివేగం, ఓవర్‌లోడ్ కారణంగానే ప్రమాదం జరిగిందని అంచనా**

**మృతుల కుటుంబాలకు ప్రధాని, సీఎం పరిహారం ప్రకటన**

**ప్రమాదంలో 30 మందికి పైగా గాయాలు, పలువురి పరిస్థితి విషమం**

మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో గత రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో వెళు_న్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడటంతో 15 మంది దుర్మరణం చెందారు. వీరిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. మరో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ విషాద ఘటన జరిగింది.పోలీసుల కథనం ప్రకారం, పనులు ముగించుకుని సుమారు 40 మందికి పైగా కూలీలు ఒక పికప్ వ్యాన్‌లో తమ గ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులతో, అతివేగంతో వెళ్తున్న వాహనం చిక్లియా ఫాటా సమీపంలో నియంత్రణ కోల్పోయింది. దీంతో వాహనం పలుమార్లు పల్టీలు కొట్టి, డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వ్యాన్‌లో ఉన్నవారు దాని కింద నలిగిపోయి ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ధార్‌లోని జిల్లా భోజ్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం ఇండోర్‌లోని ఆసుపత్రులకు తరలించారు.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి కూడా ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఈ ఘటనపై తిర్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# నలుగురు పిల్లల తల్లి.. ఒకే కాన్పులో మరో ముగ్గురికి జన్మ

**మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లా ఆసుపత్రిలో అరుదైన ఘటన**

**తల్లీ, ముగ్గురు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడి**

**వైద్యులనే ఆశ్చర్యపరిచిన సాధారణ ప్రసవం**

మధ్యప్రదేశ్‌లో ఓ అరుదైన ఘటన చోటుచేసుకుంది. సత్నా జిల్లా ఆసుపత్రిలో 34 ఏళ్ల మహిళ ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. ఇప్పటికే నలుగురు పిల్లలున్న ఆమెకు, ఈ కాన్పుతో మొత్తం సంతానం ఏడుకు చేరింది. విశేషమేమిటంటే, ముగ్గురు శిశువులు సాధారణ కాన్పు (నార్మల్ డెలివరీ) ద్వారా జన్మించడం. ప్రస్తుతం తల్లీ, ముగ్గురు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.పన్నా జిల్లా ఉజ్నేహి గ్రామానికి చెందిన కంచన్ సోనీ (34) అనే మహిళకు పురిటినొప్పులు రావడంతో మొదట పన్నా జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, ఆమె గర్భంలో ముగ్గురు శిశువులు ఉన్నారని నిర్ధారించి, కేసు సంక్లిష్టంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సత్నా జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఏప్రిల్ 27న ఆసుపత్రిలో చేరిన ఆమెకు, అదే రోజు రాత్రి 90 నిమిషాల వ్యవధిలో ప్రసవం జరిగింది. రాత్రి 10:34 గంటలకు మొదటి బాబు, 0:45 గంటలకు రెండో బాబు, 11:57 గంటలకు పాప జన్మించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.ముగ్గురు శిశువులు సాధారణ కాన్పు ద్వారా జన్మించడం వైద్యపరంగా చాలా అరుదైన విషయమని వైద్యులు పేర్కొన్నారు. పుట్టిన శిశువులు వరుసగా 2 కేజీలు, 2.3 కేజీలు, 2.65 కేజీల బరువుతో ఆరోగ్యంగా ఉన్నారని గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ మంజు సింగ్ వివరించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు పోస్ట్ నేటల్ కేర్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. కంచన్ సోనీకి ఇప్పటికే 11, 9, 7, 5 ఏళ్ల వయసున్న నలుగురు పిల్లలు ఉన్నారు. ఐదో నెలలోనే అల్ట్రాసౌండ్ పరీక్ష ద్వారా గర్భంలో



ముగ్గురు శిశువులు ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలుసు. ఇదే ఆసుపత్రిలో 2025 నవంబర్‌లో కూడా ఇలాంటి విజయవంతమైన ట్రిప్లెట్ డెలివరీ జరిగింది.

# నేడు ఏపీ కేబినెట్ భేటీ .. ఈ కీలక అంశాలపై చర్చ

**అమరావతిలో రూ.1,208 కోట్ల ట్విన్ టవర్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే అవకాశం**

**సచివాలయం, అసెంబ్లీ భవనాల పనులకు పరిపాలన అనుమతులకు నిర్ణయం**

**పలు సంస్థలకు భూ కేటాయింపులు, రైతులకు కౌలు పెంపుపై చర్చ**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు ఉదయం 10.30 గంటలకు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో ప్రధానంగా రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేయనున్నారు. నిలిచిపోయిన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి, పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకోనుంది.సమావేశం అజెండాలో అత్యంత కీలకమైనది అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.1,208.41 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'ట్విన్ టవర్ల' ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదముద్ర వేయనుంది. దీంతో పాటు సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల టవర్ల ఫేకేడ్, గ్లాజింగ్ పనులకు (రూ.2,540 కోట్లు), అసెంబ్లీ భవన నిర్మాణ పనులకు (రూ.798 కోట్లు) కూడా ఆమోదం తెలపనున్నారు.అలాగే, సెబీ, స్వామి నారాయణ్ గురుకుల్, డీఏవీ స్కూల్ వంటి పలు సంస్థలకు భూ కేటాయింపుల ప్రతిపాదనలను కూడా మంత్రివర్గం ఆమోదించనుంది. భూసమీకరణ కింద భూములిచ్చిన రైతులకు మెట్ట భూమికి రూ.40,000, జరీబు భూమికి రూ.60,000 చొప్పున వార్షిక కౌలు పెంచే అంశం కూడా అజెండాలో ఉన్నట్లు సమాచారం.

# వినుకొండ మాజీ సీఐపై అత్యాచారం కేసు.. మహిళ ఫిర్యాదుతో దర్యాప్తు

**వినుకొండ మాజీ సీఐ చిన్న మల్లయ్యపై లైంగిక దాడి దఆరోపణలు**

**ఫామ్ అద్దెకు తీసుకున్న మహిళ నుంచి పోలీసులకు ఫిర్యాదు**

**బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**

**ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న విచారణ**

**మహిళను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలింపు**



పల్నాడు జిల్లా వినుకొండలో సీఐగా పని చేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న చిన్న మాల్లయ్యపై కేసు నమోదు అయింది. చిన్న మల్లయ్య తనపై అత్యాచారం చేశారంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో చిన్న మల్లయ్యకు చెందిన నాటు కోళ్ల ఫారాన్ని ఆమె అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే చిన్న మల్లయ్య తనపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆమె తన ఫిర్యాదులో ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.మహిళ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసు విచారణను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఒకప్పుడు శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలు నిర్వర్తించిన అధికారిపైనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

# బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారు

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**కేటీఆర్, హరీశ్ తదితర నాయకుల ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపణ**

**ప్రైవేటు హ్యాకర్లను బెంగళూరు నుంచి తీసుకువచ్చారన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ సహా నాయకులను ఇరికించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం**





బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను, ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కేటీఆర్, హరీశ్ రావులతో పాటు తమ పార్టీకి చెందిన సీనియర్ నాయకుల ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు హ్యాకర్లను బెంగళూరు నుంచి తీసుకువచ్చి హ్యాక్ చేస్తున్నారని తమ వద్ద ఉన్న ఆధారాలతో సహా కేటీఆర్, హరీశ్ రావులు ప్రజల ముందు పెట్టారని అన్నారు.తమ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేతలు స్పందించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం సిట్ వేయాలని అన్నారు. ఈ హ్యాకింగ్ వాస్తవమా, కాదా చెప్పాలని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు చేయని నేరాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ వేస్తోందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్ రావులను ఇరికించే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు.2024 మార్చిలో ఒక పోలీసు అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసు ఇప్పటి వరకు ఒక ధారావాహిక వలె కొనసాగుతోందని అన్నారు. ఇప్పటి వరకు 350 మంది సాక్షులను విచారించినా ఛార్జ్‌షీట్ మాత్రం ఫైల్ చేయలేదని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండుసార్లు సిట్ ఏర్పాటు చేశారని అన్నారు. ఇది కేవలం రాజకీయ కక్షతోనే చేస్తున్నారని ధ్వజమెత్తారు.సాంకేతిక ఆధారాలతో సరైన సాక్ష్యాలతో విచారణ జరపాల్సిన కేసులో కావాలని కొంతమంది పాత నేరస్థులతో రాజకీయ నాయకుల పేర్లను చెప్పాలని ఒత్తిడి చేసి తప్పుడు ఆధారాలు సేకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో కూడా ఫోన్ ట్యాపింగ్ సాధారణమే అని, ఏ ప్రభుత్వమైనా ట్యాపింగ్ చేస్తుందని చెప్పారని గుర్తు చేశారు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ అంశంలో గత అధికారులు ఎవరైనా తప్పు చేస్తే, చట్టబద్ధంగా విచారణ జరపాలి తప్ప లేని ఆధారాలు సృష్టించి, తప్పుడు సాక్ష్యాలు చూపి రాజకీయ నాయకులను ఇరికించాలని చూడటం సరైంది కాదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ అత్యంత గోప్యంగా జరిగే ప్రక్రియ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా పేర్కొన్న టి.ప్రభాకర్ రావు అనే పోలీసు అధికారిని 19 రోజుల పాటు విచారణ పేరుతో మానసికంగా హింసించారని అన్నారు. కానీ సుప్రీంకోర్టు ప్రభాకర్ రావుకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల పేర్లు చెప్పాలని బలవంతం చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

# నాకొచ్చే రూ.1 లక్ష వేతనం ట్రస్టులకు ఇస్తా: వి.హనుమంతరావు

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా రెండేళ్ల పాటు ఉంటానన్న వీహెచ్**

**తాను అడిగితే కాంగ్రెస్ పార్టీ ఏదీ కాదనలేదన్న వీహెచ్**

**తనకు పార్టీ మారే అవసరం, అలవాటు లేదన్న వీహెచ్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా తనకు నెలకు రూ.1 లక్ష వేతనం వస్తుందని, తన రెండేళ్ల పదవీ కాలంలో వచ్చే మొత్తాన్ని ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న విద్యార్థుల కోసం ఇస్తానని వి. హనుమంతరావు ప్రకటించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (బీసీ సంక్షేమం, అభివృద్ధి) నియమించిన విషయం తెలిసిందే. ఆయనకు కేబినెట్ హోదా ఉంటుంది.ఆయన మాట్లాడుతూ, తన పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని, ప్రతి నెల రూ.1 లక్ష వేతనం వస్తుందని తెలిపారు. ఈ మొత్తాన్ని పేద విద్యార్థులకు అందించేలా ట్రస్టులకు ఇస్తానని హామీ ఇచ్చారు. తనకు కీలక పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏది అడిగినా కాంగ్రెస్ పార్టీ కాదనలేదని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ అడిగితే, రాజీవ్ గాంధీ తనపై అభిమానంతో రెండుసార్లు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా రెండుసార్లు ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు.రాజీవ్ గాంధీ చనిపోయిన తర్వాత కూడా తనను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించిందని అన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్టుగా కులగణనను గ్రామగ్రామానికి తీసుకువెళతానని అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే రేవంత్ రెడ్డి ఆశయాన్ని ముందుకు తీసుకువెళతానని అన్నారు. ప్రధాని మోదీ ఓబీసీలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. తనకు పార్టీ మారే అవసరం, అలవాటులేదని, ఏ పార్టీలో ఉన్నానో ఆ పార్టీలోనే ఉంటానని అన్నారు.

# 'అమ్మఒడి' తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

**బహిరంగ ప్రదేశాల్లో శిశువులకు పాలు పట్టే సమయంలో ఇబ్బంది పడుతున్న తల్లులు**

**కాచిగూడ బస్ టెర్మినల్‌లో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన సీతక్క**

**రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న మంత్రి**

**దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక**



పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. దత్తత తీసుకోవాలనుకునే వారు అధికారికంగా ఐసీడీఎస్‌ను మాత్రమే సంప్రదించాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో శిశువులకు పాలు పట్టే సమయంలో తల్లులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, కాచిగూడ బస్ టెర్మినల్‌లో 'అమ్మఒడి' తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సూచనలు చేశారు.ఇలాంటి 'అమ్మఒడి' తల్లిపాల ఫీడింగ్ కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె తెలిపారు. ముఖ్యంగా సమ్మక్క-సారలమ్మ జాతర వంటి భారీ జనసమూహాలు ఉండే చోట కూడా తల్లుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రోజూ బెల్లం తింటే బరువు పెరుగుతారా..



బెల్లం పోషకాల నిధి.. బెల్లంలో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ "బి" కాంప్లెక్స్ వంటి అనేక పోషకాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉండటం వల్ల శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. బెల్లం..శతాబ్దాలుగా భారతదేశంలో ఎక్కువగా ఉపయోగిస్తున్న ఆహార పదార్థం. ముఖ్యంగా చలికాలంలో బెల్లం తీసుకోవడం చాలా ముఖ్యం. శరీరంలో వేడిని పెంచి చలి నుంచి రక్షణ కల్పిస్తుంది. అయితే రోజూ బెల్లం తినడం వల్ల బరువు పెరుగుతారా..బెల్లంలో కేలరీలు ఉంటాయి. అధిక కేలరీలను తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. కానీ బరువు పెరగడానికి బెల్లం ప్రత్యక్ష కారణం అని చెప్పలేం. అయితే అధికంగా తీసుకోవడం వల్ల బరువు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. **బరువు పెరగడానికి కారణాలు..** మితిమీరిన వినియోగం: మీరు ప్రతిరోజూ ఎక్కువ పరిమాణంలో బెల్లం తీసుకుంటే, అదనపు కేలరీలు బరువు పెరగడానికి దోహదం చేస్తాయి.ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవడం: మీరు బెల్లం, స్వీట్లు లేదా ఇతర అధిక కేలరీల ఆహారాలతో తియ్యటి పానీయాలను తీసుకుంటే, మీ బరువు పెరిగే అవకాశాలు పెరుగుతాయి. శారీరక శ్రమ లేకపోవడం: మీరు క్రమం తప్పకుండా వ్యాయామం చేయకపోతే, అదనపు కేలరీలు తీసుకోవడం బరువు పెరగడానికి దోహదం చేస్తుంది.**బెల్లం సమతుల్య వినియోగం..** ప్రతిరోజూ 1-2 టీస్పూన్ల బెల్లం తీసుకోవడం సురక్షితంగా పరిగణిస్తారు..బెల్లాన్ని ఆరోగ్యకరమైన వాటితో కలిపి తీసుకోవాలి: బెల్లం పాలు, పెరుగు లేదా పండ్లతో మాత్రమే కలిపి తీసుకోవాలి. వ్యాయామం: రెగ్యులర్ ఎక్సర్ సైజ్ మీరు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది.బెల్లం ఒక ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారం, కానీ దానిని అధికంగా తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, బెల్లం పరిమిత వినియోగం ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడతాయి.**గమనిక:** ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# నోటి దుర్వాసనను తగ్గించే చిట్కాలు

**జీర్ణకోశం బలంగా లేకపోతే నోటి దుర్వాసన**

**అధికంగా వుంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమస్య వచ్చినప్పుడు**

**నలుగురిలోకి వెళ్లాలన్న చాలా ఇబ్బందిగా ఉంటుంది.**

**కాబట్టి నోట్లో దుర్వాసన రాకుండా ఎలాంటి చిట్కాలు**

**ఫాలో అవ్వాలో ఇప్పుడు తెలుసుకుందాం..**

-కొబ్బరినికోరి మెత్తగా రుబ్బి పిండితే వచ్చే రసం . కొబ్బరిపాలు)లో తగినంత పచ్చకర్పూరం వేసుకొని పచ్చిగానే తాగవచ్చు. లేదా బాగా కాచి తాగవచ్చు. నోటి దుర్వాసన తగ్గుతుంది.

- గజనిమ్మకాయ నాలుగు భాగాలుగా చేసి చిన్నముక్కలుగా తరిగి, ఒక్కో ముక్కని బుగ్గన పెట్టుకుని చప్పరిస్తే నోరు శుభ్రపడ్తుంది. దుర్వాసన తగ్గుతుంది.

-జాజికాయ, జాపత్రీ, పచ్చ కర్పూరం కొద్దిగా తీసుకొని దంచి, ఎండుద్రాక్షలతోనూరి, చిన్న మాత్రలు కట్టి ఒక్క మాత్రని బుగ్గన పెట్టుకొని చప్పరించండి. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది.

-దాల్చిన చెక్క బెరడు చిన్నముక్కను బుగ్గన ఉంచుకొని నములుతూ వుంటే నోరు శుభ్రంగా ఉంటుంది.


-తమలపాకులు నాలుకమీద జిగురును హరిస్తాయి. పచ్చకర్పూరం వేసిన కిళ్లీ తింటే నోటిలో మంచి సువాసన వస్తుంది.

-ఏలకులు, లవంగం కూడా నోటి దుర్వాసనని హరిస్తాయి. కాబట్టి అప్పుడప్పుడు నోట్లో ఏలకులు గానీ, లవంగాలు గానీ వేసుకోవడం ఉత్తమం.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి



# హార్ట్ ఎటాక్ తర్వాత తొలి 60 నిమిషాలు ఎందుకంత కీలకం..




గుండెపోటు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో ముఖ్యమని, ఆలస్యం చేయకుండా రోగిని ఆసుపత్రికి చేర్చడం అత్యవసరమని కార్డియాలజిస్టులు స్పష్టం చేస్తున్నారు. మధుమేహ (డయాబెటిస్) రోగులు గుండె ఆరోగ్యం పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రముఖ వైద్యులు గుండెపోటు లక్షణాలు, నివారణ పద్ధతులపై కీలక అంశాలను వెల్లడించారు."గోల్డెన్ హవర్" ప్రాముఖ్యత. ఆధునిక జీవనశైలిలో చాలామంది సౌకర్యానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని, కాలుష్యం నుంచి కూడా రక్షణ చాలా అవసరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. గుండెపోటు సంభవించిన తర్వాత తొలి గంట (60 నిమిషాలు) ప్రమాదాన్ని తగ్గించడానికి చాలా అవసరం. అయితే, ఒక హృద్రోగికి ప్రతి నిమిషం విలువైనదే. రోగి ఎంత త్వరగా ఆసుపత్రికి చేరుకుంటే, చికిత్స అంత త్వరగా ప్రారంభించవచ్చు. దీనివల్ల వారు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే కాలయాపన చేయకుండా దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని, ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి మెరుగైతే, ఆ తర్వాత వారు కోరుకున్న ఆసుపత్రి లేదా వైద్యుడిని సంప్రదించవచ్చని, గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఈ 'గోల్డెన్ రూల్' పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

## జపనీస్ ట్రీ ఫ్రాగ్ లో అమేజింగ్ బ్యాక్టీరియా..

# సింగిల్ డోస్‌తోనే క్యాన్సర్ ట్యూమర్లు మాయం

భయంకరమైన క్యాన్సర్ మహమ్మారిపై పోరాటంలో ప్రకృతి మరో అద్భుత రహస్యాన్ని విప్పింది. జపాన్‌లోని చెట్లపై నివసించే ఒక చిన్న కప్ప శరీరంలో క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసే శక్తి గల బ్యాక్టీరియా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. 'జపాన్ అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' పరిశోధకులు జరిపిన ఈ ప్రయోగం వైద్య రంగంలో కొత్త ఆశలు చిగురింపజేస్తోంది.**క్యాన్సర్ కణాలను తుడిచిపెట్టే గుణం..**సాధారణంగా ఉభయచరాలు, సరీసృపాలకు క్యాన్సర్ రావడం చాలా అరుదు. ఈ అంశంపై దృష్టి సారించిన శాస్త్రవేత్తలు, జపనీస్ చెట్టు కప్పల పేగుల్లో ఉండే 'ఎవింగెల్లా అమెరికానా' అనే బ్యాక్టీరియాకు క్యాన్సర్ కణాలను తుడిచిపెట్టే గుణం ఉందని కనుగొన్నారు. ప్రయోగశాలలో ఎలుకలపై జరిపిన పరీక్షల్లో, ఈ బ్యాక్టీరియాను కేవలం ఒక్కసారి ఇంజెక్ట్ చేయగానే 100 శాతం ఫలితాలు వచ్చాయి. కొలొరెక్టల్ (పేగు) క్యాన్సర్ గడ్డలు పూర్తిగా కరిగిపోవడాన్ని చూసి పరిశోధకులు విస్మయం చెందారు.**రెండు విధాల దాడి..**ఈ బ్యాక్టీరియా క్యాన్సర్‌పై రెండు రకాలుగా దాడి చేస్తుంది. నేరుగా నాశనం.. శరీరంలోకి ప్రవేశించిన ఈ బ్యాక్టీరియా, నేరుగా క్యాన్సర్ గడ్డ ఉన్న చోటికే చేరుకుంటుంది. అక్కడ ఆక్సిజన్ తక్కువగా ఉన్న వాతావరణంలో వేగంగా పెరిగి, క్యాన్సర్ కణాలను లోపలి నుంచే చిన్నాభిన్నం చేస్తుంది. అదే సమయంలో ఇది మన శరీరంలోని రోగనిరోధక కణాలను ఉత్తేజపరుస్తుంది. దీంతో మన సొంత ఇమ్యూనిటీ కూడా క్యాన్సర్ కణాలపై యుద్ధానికి దిగుతుంది.**భవిష్యత్తులో 'వ్యాక్సిన్'లా పనిచేస్తుందాఅంటే..**ఈ పరిశోధనలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఒకసారి ఈ చికిత్స పొందిన ఎలుకలలోకి మళ్ళీ క్యాన్సర్ కణాలను ప్రవేశపెట్టినా, వాటికి తిరిగి క్యాన్సర్ రాలేదు. అంటే ఈ బ్యాక్టీరియా శరీరంలో ఒక 'ఇమ్యూన్ మెమరీ'ని సృష్టించి, భవిష్యత్తులో క్యాన్సర్ మళ్లీ రాకుండా రక్షణ కల్పిస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కీమోథెరపీ, ఇమ్యూనోథెరపీ కంటే ఇది మెరుగ్గా పనిచేస్తోంది. ముఖ్యంగా ఆరోగ్యకరమైన కణాలకు ఎటువంటి హాని కలగకుండా కేవలం క్యాన్సర్ గడ్డలను మాత్రమే



లక్ష్యంగా చేసుకోవడం దీని ప్రత్యేకత. త్వరలోనే మనుషులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని పరిశోధకులు చెబుతున్నారు.**గమనిక:** ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.


## ఏపీ ప్రభుత్వ నిర్ణయంపై ఐఎంఏ అభ్యంతరం..

# ఆయుర్వేద సర్జరీలపై ఆగ్రహం..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఒక ఉత్తర్వు ఇప్పుడు అల్లోపతి,ఆయుర్వేద వైద్య వర్గాల మధ్య చిచ్చు పెట్టింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయుర్వేద వైద్యులు 58 రకాల శస్త్రచికిత్సలను స్వతంత్రంగా నిర్వహించవచ్చని ప్రభుత్వం అనుమతించడమే దీనికి కారణం.**ప్రధానికి ఫిర్యాదు చేసే యోచన..**ఆయుర్వేదాన్ని దాని స్వచ్ఛమైన రూపంలో తాము గౌరవిస్తామని, కానీ శాస్త్రీయత లేని విధంగా వైద్య విధానాలను కలపడం వెనకడుగు వేయడమేనని విమర్శించింది. ఈ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, ప్రధాన మంత్రికి వినతి పత్రం అందజేయ నున్నట్లు సంఘం వెల్లడించింది. ఈ వివాదంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రోగుల భద్రతే పరమావధిగా వైద్య విధానాల్లో స్పష్టత ఉండాలని నిపుణులు కోరుతున్నారు.**'మిక్సోపతీ'తో ముప్పు..**ప్రభుత్వ నిర్ణయాన్ని 'హిమాలయన్ బ్లండర్' అంటే పెద్ద తప్పిదంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అభివర్ణించింది. ఆధునిక వైద్యం సంప్రదాయ వైద్య విధానాలను కలపడం వల్ల వినాశకరమైన పరిణామాలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది.**ఐఎంఏ లేవనెత్తిన ప్రధానాంశాలు ఏమిటంటే..** శస్త్రచికిత్స చేయాలంటే మానవ శరీర నిర్మాణ శాస్త్రం, ఫిజియాలజీ, అనస్థీషియాపై దశాబ్ద కాలం పైగా కఠినమైన శిక్షణ అవసరం. అటువంటి శిక్షణ లేని వారికి సర్జికల్ బ్లేడ్లు ఇవ్వడం రోగుల ప్రాణాలకు ముప్పు అని ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ పి భానుశాలి పేర్కొన్నారు.అనుమతి ఇచ్చిన 58 రకాల సర్జరీలలో అపెండిసైటిస్, హెర్నియా, కంటి శుక్లాల (ఙఖ్థీఖేఖ్) వంటి క్లిష్టమైన ఆపరేషన్లు ఉన్నాయి. శస్త్రచికిత్స అంటే కేవలం కోత కోయడం మాత్రమే కాదని, ఆపరేషన్ తర్వాత వచ్చే సమస్యలను గ్రాశీర్-శీజూవతీఖఅజవ ఓశీఎజూశ్రీఅఖ్ఆశీఅం) ఎదుర్కోవడం కూడా కీలకమని సంఘం స్పష్టం చేసింది. **గమనిక:** ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.




# నార్మల్ యాంటీబయాటిక్స్‌కు లొంగని 'సూపర్‌బగ్స్'.. హెచ్చరిక..



దేశంలో ప్రజారోగ్యానికి పెనుముప్పు పొంచి ఉంది! అత్యంత సాధారణంగా వచ్చే యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు , న్యుమోనియా, సెప్సిస్ రక్తంలో ఇన్ఫెక్షన్ వంటి వ్యాధులకు చికిత్స చేయడం రానురాను కష్టంగా మారుతోందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తాజాగా విడుదల చేసిన నివేదిక తీవ్రంగా హెచ్చరించింది.సాధారణంగా రోగులకు వాడే కీలకమైన యాంటీబయాటిక్స్ కు ఇప్పుడు అనేక రకాల సూపర్‌బగ్స్ నిరోధకతను పెంచుతున్నాయని 2024 సంవత్సరానికి సంబంధించిన 'యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ రీసెర్చ్ అండ్ సర్వైలెన్స్ నెట్‌వర్క్ ' నివేదికలో స్పష్టం చేసింది**ప్రధానంగా విఫలమవుతున్న యాంటీబయాటిక్స్ ఇవే..**ప్రముఖ ఆసుపత్రుల నుంచి సేకరించిన దాదాపు లక్ష ప్రయోగశాల-నిర్ధారిత ఇన్ఫెక్షన్ నమూనాలను విశ్లేషించిన తర్వాత ఈ నివేదికను విడుదల చేశారు. దీని ప్రకారం, చికిత్సకు సాధారణంగా వాడే మందులు విఫలమవుతున్నాయి.క్వినోలోన్స్ అతిసారం టైఫాయిడ్ వంటి వ్యాధులకు ఇచ్చే ఈ మందులు 95శాతం పైగా కేసుల్లో విఫలమవుతున్నాయి. థర్డ్-జనరేషన్ సెఫాలోస్పోరిన్స్ : ఇవి కూడా అనేక ఇన్ఫెక్షన్లకు సరిగా పనిచేయడం లేదు.కార్బపెనమ్స్ . వీటిని అత్యంత శక్తివంతమైన యాంటీబయాటిక్స్‌గా పరిగణిస్తారు. ఐసీయూ లలో వచ్చే తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు ఇవి కీలకం. అయితే, క్లెబ్సియెల్లా న్యుమోనియే (ఖశ్రీవఎంఅవశ్రీశ్రీఖ జూఅవబఎశీఅఖువ) వంటి బ్యాక్టీరియా ఈ మందులకు కూడా లొంగడం లేదు. పైపెరాసిలిన్-టాజోబాక్టమ్ ..న్యుమోనియాకు ప్రధాన కారణమైన క్లెబ్సియెల్లా బ్యాక్టీరియా దాదాపు 75శాతం కేసుల్లో ఈ డ్రగ్‌కు నిరోధకతను చూపింది.ఐసీయూలలో మరింత తీవ్రమైన పరిస్థితి..ముఖ్యంగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు లలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఎసినిటోబాక్టర్ బౌమన్నీ ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యంత ప్రమాదకరమైన జాబితాలో చేర్చిన ఈ బ్యాక్టీరియా, శక్తివంతమైన మెరోపెనమ్ అనే యాంటీబయాటిక్‌కు 91శాతం నిరోధకతను కలిగి ఉందని నివేదిక తెలిపింది.రక్త ప్రసారం ఇన్ఫెక్షన్లు ..రక్తంలో సంభవించే తీవ్రమైన ఇన్ఫెక్షన్లలో 72శాతం వరకు మందులకు లొంగని గ్రామ్-నెగటివ్ బ్యాక్టీరియా వల్లే వస్తున్నాయని నివేదిక పేర్కొంది.సాధారణంగా వాడే యాంటీబయాటిక్స్ శక్తి కోల్పోతుండటం వల్ల, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు చికిత్స ఎంపికలు వేగంగా తగ్గిపోతున్నాయి. దీంతో వైద్యులు మరింత ప్రమాదకర మైన లేదా సంక్లిష్టమైన ఔషధాల కలయికను ఉపయోగించా ల్సి వస్తోంది.వివేకవంతమైన యాంటీబయాటిక్ వాడకం : అనవసరంగా లేదా వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ వాడకాన్ని కఠినంగా నియంత్రించాలి.ఆసుపత్రులు, కమ్యూనిటీలలో పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ ప్రమాణాలను బలోపేతం చేయాలి.సూపర్‌బగ్‌ల వ్యాప్తిని, నిరోధకత స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలి.సులభంగా నయమయ్యే ఇన్ఫెక్షన్లకు కూడా శక్తివంతమైన యాంటీబయాటిక్స్ విఫలమవడం ప్రమాదకర సంకేతం. తక్షణమే యాంటీబయాటిక్ వాడకంపై కఠిన నియంత్రణలు, ఇన్ఫెక్షన్ నివారణ చర్యలు చేపట్టకపోతే, సాధారణ ఇన్ఫెక్షన్లకు కూడా చికిత్స అందించడం అసాధ్యంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# రాత్రి 9 గంటల తర్వాత డిన్నర్ చేయడం వల్ల కలిగే నష్టాలు ఇవే..



మీరు కూడా మీ బిజీ లైఫ్‌స్టైల్ కారణంగా రోజూ రాత్రి 9 గంటల తర్వాత డిన్నర్ చేస్తున్నారా? ఈ రోజుల్లో చాలా మంది ఆలస్యంగా డిన్నర్ చేస్తున్నారు, కానీ ఇది ఏమాత్రం సరైన విధానం కాదని చెబుతున్నారు వైద్యనిపుణులు. రోజూ రాత్రి 9 గంటల తర్వాత డిన్నర్ చేయడం వల్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..**జీర్ణవ్యవస్థపై ఒత్తిడి..**మన శరీరంలోని ప్రతి పని సిర్కాడియన్ రిథమ్ (శరీర గడియారం) ప్రకారం పనిచేస్తుంది. మనం రాత్రి ఆలస్యంగా ఆహారం తీసుకున్న ప్పుడు, ఈ రిథమ్ దెబ్బతినడం మొదలవుతుంది. వాస్తవానికి, రాత్రిపూట జీవక్రియ పగటిపూట అంత వేగంగా ఉండదు. అందుకే మనం రాత్రి ఆలస్యంగా ఆహారం తీసుకున్నప్పుడు, దాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది, దీనివల్ల అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు.**బరువు పెరిగే అవకాశం..**ఆలస్యంగా డిన్నర్ చేసే వ్యక్తులలో ఊబకాయం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణం రాత్రిపూట కేలరీలు బర్న్ కావు ,శరీరం వాటిని నిల్వ చేసుకుంటుంది. దీనితో పాటు, ఆలస్యంగా తిన్న తర్వాత నిద్రపోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ కూడా పెరుగుతుంది, ఇది డయాబెటిస్, జీవక్రియ రుగ్మతలకు దారితీస్తుంది. **నిద్ర నాణ్యత దెబ్బతింటుంది..**డిన్నర్ చేసిన వెంటనే నిద్రపోవడం వల్ల కడుపు భారీగా అనిపిస్తుంది. నిద్రకు ఆటంకం కలుగుతుంది. అలాగే, యాసిడ్ రిఫ్లక్స్ సమస్య తలెత్తవచ్చు, దీనివల్ల ఛాతీలో మంట, అసౌకర్యం అనిపిస్తుంది. మంచి నిద్ర కోసం, భోజనం, నిద్ర మధ్య కనీసం 2-3 గంటల వ్యత్యాసం ఉండాలి. హార్మోన్ల అసమతుల్యత..శరీరంలోని సిర్కాడియన్ రిథమ్ హార్మోన్లను నియంత్రిస్తుంది. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల కార్టిసాల్, ఇన్సులిన్ స్థాయిలు అసమతుల్యతకు గురవుతాయి, దీనివల్ల అలసట, మూడ్ స్వింగ్స్ ,దీర్ఘకాలికంగా హార్మోన్ల రుగ్మతలు ఏర్పడవచ్చు. గుండె ఆరోగ్యంపై ప్రభావం..రాత్రి ఆలస్యంగా ఆహారం తీసుకోవడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ , కార్టిసాల్ హార్మోన్ పెరుగుతుంది. ఈ రెండు కూడా గుండె జబ్బులకు కారణం కావచ్చు.**డిన్నర్ చేయడానికి సరైన సమయం ఏది.. అంటే..**డిన్నర్‌ను సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య పూర్తి చేయాలి. ఇది మీ శరీరానికి ఆహారాన్ని జీర్ణం చేయడానికి తగినంత సమయం ఇస్తుంది. రాత్రిపూట మంచి నిద్ర పొందడానికి వీలవుతుంది.గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# నేను గన్ పట్టుకుని రంగంలోకి దిగానంటే

## ఇరాన్‌కు ట్రంప్ తాజా వార్నింగ్



టెహ్రాన్ స్పందన ఏంటంటే వాషింగ్టన్ - టెహ్రాన్ మధ్య సాగుతున్న దౌత్య యుద్ధం ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేసిన ఒక చిత్రం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. ఆ చిత్రంలో ట్రంప్ మెషిన్ గన్ పట్టుకుని ఉండగా, వెనుక ఇరాన్ భూభాగం బాంబుల ధాటికి ధ్వంసమవుతున్నట్లు కనిపిస్తోంది. ఈ శక్తివంతమైన దృశ్యం ద్వారా.. ఇరాన్ త్వరగా బుద్ధి తెచ్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. అణ్వాయుధ రహిత ఒప్పందంపై సంతకం చేయడం ఇరాన్‌కు చేతకావడం లేదని, వారు సరిగ్గా వ్యవహరించలేకపోతున్నారని ట్రంప్ నిప్పులు చెరిగారు. ఈ హెచ్చరికకు కొన్ని గంటల ముందే.. ఇరాన్ ఆర్థికంగా, రాజకీయంగా 'పతనం అంచున' ఉందని ట్రంప్ బాంబు పేల్చారు. ఇరాన్ నాయకత్వం తీవ్ర సంక్షోభంలో ఉందని, తమ దేశ పరిస్థితిని చక్కదిద్దుకునే వరకు ప్రపంచ చమురు నాడి అయిన హార్ముజ్ జలసంధిని తెరవాలని వారు అమెరికాను కోరుతున్నట్లు ఎతీబఎజూ పేర్కొన్నారు. ఇది ఇరాన్ నిస్సహాయతను ప్రపంచానికి చాటిచెప్పే ప్రయత్నంగా కనిపిస్తోంది. అయితే, రెండు నెలలుగా సాగుతున్న ఈ రక్తపాతాన్ని ముగించేందుకు ఇరాన్ పంపిన తాజా ప్రతిపాదనలు వాషింగ్టన్‌ను ఏమాత్రం సంతృప్తి పరచలేదు. దీంతో శాంతి చర్చలు సఫలమవుతాయన్న ఆశలు ఆవిరైపోయాయి. అమెరికా ఇరాన్ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అసలు ఈ ఉద్రిక్తతలకు బీజం పాకిస్థాన్ వేదికగా జరిగిన చర్చల్లో పడింది. ఏప్రిల్ 11, 12 తేదీల్లో ఇరు దేశాల ప్రతినిధులు ముఖాముఖి భేటీ అయినప్పటికీ, ఫిబ్రవరిలో మొదలైన యుద్ధానికి ముగింపు పలకడంలో ఏకాభిప్రాయం కుదరలేదు. గత వారం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఇస్లామాబాద్ సందర్శించినప్పుడు చర్చలు మళ్ళీ మొదలవుతాయని భావించారు. కానీ అమెరికా బృందం అక్కడికి చేరుకునేలోపే ఆయన నిష్క్రమించడం పెద్ద దౌత్యపరమైన వైఫల్యంగా మారింది. ఈ పరిణామంతో ఆగ్రహించిన ట్రంప్, తన సన్నిహితులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్‌ల పర్యటనను రద్దు చేసి, ఇకపై ముఖాముఖి చర్చలు ఉండవని, అన్నీ ఫోన్ ద్వారానే జరుగుతాయని తెగేసి చెప్పారు. ఇరాన్ యుద్ధంపై ట్రంప్‌కు అన్నీ అబద్ధాలు చెబుతున్నారు.. అమెరికా డేంజర్ జోన్‌లోకి వెళ్లిందంటున్న జేడీ వాన్స్.. ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభనకు ప్రధాన కారణం 'నావికా దిగ్బంధనం'. అమెరికా తన నౌకాదళాన్ని ఉపసంహరించుకుంటేనే చర్చలకు వస్తామని ఇరాన్ పట్టుబడుతోంది. అటు ఇరాన్ చమురు మార్గాలను మూసివేయడంతో, దానికి ప్రతిస్పందనగా అమెరికా గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మూడు భారీ విమాన వాహక నౌకలను మధ్యప్రాచ్యంలో మోహరించింది. ఈ సైనిక బల ప్రదర్శన, ఇటు ఇరాన్ అణు కార్యక్రమం, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యం ఒక అగ్నిపర్వతంలా మారింది. ఇరాన్ తన పంథా మార్చుకోకపోతే, ఈ దౌత్య యుద్ధం కాస్తా పూర్తిస్థాయి సైనిక సంఘర్షణగా మారే ప్రమాదం పొంచి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు ఉన్నందున, ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు ట్రంప్ తదుపరి అడుగు వైపు ఆశగా, ఆందోళనగా చూస్తున్నాయి.

# బంగారం, వెండి ధరల పెరుగుదలపై కీలక అప్‌డేట్

## కొత్త లక్ష్యాలను విడుదల చేసిన ఆర్థిక నిపుణులు



నేడు, ఏప్రిల్ 8, 2026, బుధవారం నాడు అంతర్జాతీయ మార్కెట్లలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా మరియు ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తక్షణ మరియు లోతైన ప్రభావాన్ని చూపింది. ఈ ఒప్పందంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం, చమురు ధరలు భారీగా పతనం కావడం వల్ల సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం మరియు వెండి ధరలు సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్తున్నాయి. నేడు బంగారం ధర 3 శాతం పైగా పెరిగి ఔన్సుకు 4,850 డాలర్లకు చేరగా, వెండి ధర ఏకంగా 7 శాతం లాభపడి 77 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.ఈ చారిత్రాత్మక మార్పుకు ప్రధాన కారణం..అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం. ఇరాన్ ప్రతిపాదించిన 10-సూత్రాల ప్రణాళికను చర్చలకు ప్రారంభ బిందువుగా ఆయన అంగీకరించడంతో ఈ తాత్కాలిక శాంతి ఒప్పందం సాధ్యమైంది.దీని ఫలితంగా, ఫిబ్రవరి చివరలో ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుండి మొదటిసారిగా ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. చమురు ధరల తగ్గుదల వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గుతుందని, దీనివల్ల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచే కఠిన నిర్ణయాల నుండి వెనక్కి తగ్గుతాయని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ఈ అంచనాలే విలువైన లోహాల వైపు పెట్టుబడులు మళ్లేలా చేశాయి.కరెన్సీ మార్కెట్‌లో డాలర్ బలహీనపడటం కూడా బంగారానికి కలిసొచ్చింది. యూరోతో పోలిస్తే డాలర్ విలువ 0.8 శాతం పడిపోవడంతో, ఇతర కరెన్సీలు ఉన్న కొనుగోలుదారులకు చౌకగా మారింది. మరోవైపు, హార్ముజ్ జలసంధి తెరుచుకోవడం వల్ల ఇంధన సరఫరా మెరుగుపడుతుందని.. ఇది వెండికి పారిశ్రామికంగా స్థిరమైన డిమాండ్‌ను కల్పిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. వెండి ప్రస్తుతం తన "టర్బో-గోల్డ్" స్వభావాన్ని ప్రదర్శిస్తూ, బంగారం కంటే వేగంగా దూసుకుపోతోంది. సాంకేతికంగా చూస్తే, వెండికి 79.50 నుండి 80 డాలర్ల వరకు మార్గం సుగమంగా కనిపిస్తోంది.భగ్గుమన్న బంగారం ధరలు.. ఈ రోజు పెరుగుదలతో పసిడి రేటు ఎంత వరకు వెళ్లిందంటే.. ఏప్రిల్ 8, బుధవారం ధరలు ఇవే.. భగ్గుమన్న బంగారం ధరలు.. ఈ రోజు పెరుగుదలతో పసిడి రేటు ఎంత వరకు వెళ్లిందంటే.. ఏప్రిల్ 8, బుధవారం ధరలు ఇవే..బంగారం ధరల సాంకేతిక విశ్లేషణను పరిశీలిస్తే, ప్రస్తుతం ఇది 4,850 డాలర్ల వద్ద ఉన్న కీలకమైన నిరోధక స్థాయిని (50 ) పరీక్షించింది. జనవరిలో నమోదైన గరిష్ట స్థాయి 5,600 డాలర్లతో పోలిస్తే ఇది కొంత తక్కువగా ఉన్నప్పటికీ, ప్రస్తుత ర్యాలీ దిద్దుబాటు దశ ముగుస్తుందనడానికి సంకేతంగా కనిపిస్తోంది. దీర్ఘకాలికంగా చూస్తే ఫిబొనాచీ ఎక్స్‌టెన్షన్స్ ప్రకారం బంగారం ధర ఔన్సుకు 7,000 డాలర్ల వరకు వెళ్లవచ్చని అంచనాలు ఉన్నాయి. అదేవిధంగా, వెండి ధర కూడా 155 డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.అయితే, ఈ కాల్పుల విరమణ ఒప్పందం శాశ్వత శాంతికి దారితీస్తుందా లేదా అనేది ఇంకా స్పష్టత లేదు. హార్ముజ్ జలసంధిపై నియంత్రణ, పౌర అణు కార్యక్రమం వంటి సున్నితమైన అంశాలు ఈ చర్చల్లో ఉన్నాయి. జేపీమోర్గాన్, వెల్స్ ఫార్గో వంటి ప్రముఖ ఆర్థిక సంస్థలు సెంట్రల్ బ్యాంకుల బంగారు కొనుగోళ్ల ఆధారంగా తమ అంచనాలను పెంచాయి.ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలలో పెరుగుతున్న చైనా ప్రభావం, పెట్రోడాలర్ వ్యవస్థకు పొంచి ఉన్న ముప్పు వంటి అంశాలు పెట్టుబడిదారులను బంగారం వంటి సురక్షిత ఆస్తుల వైపు నడిపిస్తున్నాయి. 2026 మొదటి త్రైమాసికంలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత దృశ్యాలు తెరపైకి వస్తే, డాలర్ మరింత బలహీనపడి బంగారం, వెండి ధరలు ఊహించని స్థాయికి చేరవచ్చు.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఉద్యోగం కంటే సొంత వ్యాపారమే మిన్న



## ఒంటరిగా వంట చేస్తూ నెటిజన్ల మనసు గెలిచిన టెక్కీ!

ప్రస్తుతం ఐటీ రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్న వేళ, ఒక యువకుడు తీసుకున్న నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. బెంగళూరు లోని ఎలక్ట్రానిక్ సిటీ ఫేజ్ 1లో నివసించే 23 ఏళ్ల యువకుడు తన కార్పొరేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి, తన చిన్న ఫ్లాట్ నుండే ఒక క్లౌడ్ కిచెన్ స్టార్టప్‌ను ప్రారంభించాడు. ఎవరి సాయం లేకుండా వంట చేయడం, క్లీనింగ్, ప్యాకేజింగ్ , లాజిస్టిక్స్ వంటి అన్ని పనులను తనే స్వయంగా నిర్వహిస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు."ఈరోజు ఒక సాహసోపేతమైన అడుగు వేశాను"సదరు యువకుడు రెడ్డిట్ వేదికగా తన అనుభవాన్ని పంచుకుంటూ.. "నాకు 23 ఏళ్లు, ఈరోజే నా ఉద్యోగానికి రాజీనామా చేశాను. నా సొంత ప్లాన్ ప్రకారం ఎలక్ట్రానిక్ సిటీలోని నా చిన్న ఫ్లాట్ నుండే క్లౌడ్ కిచెన్ మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం అన్నీ నేనే చూసుకుంటున్నాను. నా దగ్గర పెద్దగా డబ్బు లేదు, కేవలం జోమాటోలో రిజిస్టర్ చేయడానికి , ప్యాకేజింగ్ మెటీరియల్ కొనడానికి మాత్రమే సరిపడా నిధులు ఉన్నాయి. ఇది సక్సెస్ అవుతుందో లేదో తెలియదు కానీ, నా వంతు ప్రయత్నం చేస్తున్నాను" అని రాసుకొచ్చాడు.'అర్బన్ తడ్కా'కు పెరుగుతున్న మద్దతుఅతని పోస్ట్‌కు బెంగళూరు నెటిజన్ల నుండి విశేష స్పందన లభించింది. తన క్లౌడ్ కిచెన్ పేరు 'అర్బన్ తడ్కా' అని అతను వెల్లడించగా, ఎలక్ట్రానిక్ సిటీ పరిసరాల్లో ఉండే కాలేజీ విద్యార్థులు , ఉద్యోగులు అతనికి మద్దతుగా నిలుస్తున్నారు. ఈ కిచెన్ ద్వారా నార్త్ ఇండియన్ ఫుడ్, స్ట్రీట్ ఫుడ్, రోల్స్ , శాండ్‌విచ్‌లు విక్రయిస్తున్నట్లు అతను తెలిపాడు.నెటిజన్ల సలహాలు.. హెచ్చరికలుఈ సాహసాన్ని మెచ్చుకుంటూనే నెటిజన్లు కొన్ని విలువైన సూచనలు చేశారు..క్వాలిటీ ఫోటోలు: జోమాటో, స్విగ్గీ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో ఆహార పదార్థాల ఫోటోలు ఆకర్షణీయంగా ఉండాలని, క్యాలరీల వివరాలు జోడించాలని సూచించారు.పరిశుభ్రత ముఖ్యం: "ఒక్కసారి కస్టమర్‌కు ఆరోగ్యం పాడైనా, మళ్ళీ ఆ గ్రూప్ నుండి మీకు ఆర్డర్లు రావు. కాబట్టి ఫుడ్ హ్యాండ్లింగ్‌లో అత్యంత జాగ్రత్తగా ఉండాలి" అని ఒక యూజర్ హెచ్చరించాడు.స్వయం ఉపాధి: "ఈ రోజుల్లో జీతం మీద ఆధారపడటం కంటే, సొంతంగా ఏదైనా చేసుకోవడం ఉత్తమం" అంటూ మరికొందరు అతనికి ధైర్యం చెప్పారు.యువతకు ఒక పాఠంబెంగళూరు వంటి ఖరీదైన నగరంలో, అదీ 23 ఏళ్ల వయసులో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం చిన్న విషయం కాదు. బెంగళూరు లో పెరిగిపోతున్న జీవన వ్యయం , ఉద్యోగ అనిశ్చితి మధ్య, ఈ యువకుడి ప్రయత్నం ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. సరైన ప్లానింగ్, నాణ్యమైన ఆహారం అందిస్తే ఈ క్లౌడ్ కిచెన్ భవిష్యత్తులో పెద్ద బ్రాండ్‌గా మారే అవకాశం ఉందని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు.మొత్తంగా చెప్పాలంటే, రిస్క్ తీసుకునే గుణం ఉంటేనే వ్యాపారంలో రాణించగలమని ఈ యువకుడు నిరూపిస్తున్నాడు. కార్పొరేట్ ఏసీ గదుల నుండి కిచెన్ లోని వేడి గదులకు మారడం అంత సులభం కాదు. కానీ, తన కల కోసం అతను పడుతున్న కష్టం చూస్తుంటే, బెంగళూరు స్టార్టప్ కల్చర్ మళ్ళీ కొత్త పుంతలు తొక్కుతోందని అనిపిస్తుంది. అతని ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుందాం.

## లేఆఫ్స్ నుండి తప్పించుకోవాలంటే ఏకైక మార్గం ఇదే

### గోల్డ్‌మన్ సాక్స్ కీలక సూచన!




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో కొనసాగుతున్న లేఆఫ్స్ భయాలకు తోడు, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాక్స్ ఒక చేదు వార్తను మోసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఉద్యోగం కోల్పోవడం అనేది కేవలం తాత్కాలిక నిరుద్యోగమే కాదు, అది ఒక వ్యక్తి కెరీర్‌పై పదేళ్ల వరకు ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఈ నివేదిక హెచ్చరిస్తోంది. గత 40 ఏళ్ల లేబర్ మార్కెట్ డేటాను విశ్లేషించిన తర్వాత బ్యాంక్ ఈ ముగింపుకు వచ్చింది.ఆదాయంలో భారీ కోత , కెరీర్ సెట్‌బ్యాక్‌గోల్డ్‌మన్ సాక్స్ విశ్లేషణ ప్రకారం, ఏఐ వంటి టెక్నాలజీ మార్పుల వల్ల ఉద్యోగం కోల్పోయిన వారు మళ్ళీ కొత్త ఉద్యోగం సంపాదించినా, వారి ఆదాయం సగటున 3 శాతం తగ్గుతోంది.దీర్ఘకాలిక ప్రభావం: ఉద్యోగం పోయిన పదేళ్ల తర్వాత కూడా, ఈ బాధితుల ఆదాయ వృద్ధి , స్థిరంగా ఉన్న ఉద్యోగుల కంటే 10 శాతం తక్కువగా ఉంటోంది.ఇతర కారణాలతో పోలిస్తే: సాధారణ కారణాల వల్ల ఉద్యోగం కోల్పోయిన వారి కంటే, టెక్నాలజీ మార్పుల వల్ల ఉద్యోగం పోయిన వారి ఆదాయ వృద్ధి 5 శాతం తక్కువగా నమోదవుతోంది.ఆక్యుపేషనల్ డౌన్‌గ్రేడింగ్: నైపుణ్యాల విలువ తగ్గింపుఒక ఉద్యోగి ఏఐ వల్ల తన పొజిషన్‌ను కోల్పోయినప్పుడు, అతను తన తదుపరి ఉద్యోగంలో అంతకుముందు చేసిన దానికంటే తక్కువ నైపుణ్యాలు కలిగిన హోదాకు పరిమితం కావాల్సి వస్తోంది. ఏ టెక్నాలజీ అయితే వారి ఉద్యోగాన్ని తొలగించిందో, అదే టెక్నాలజీ వారి పాత నైపుణ్యాల విలువను కూడా తగ్గించేస్తోంది. దీనివల్ల ఆర్థికంగా నిలదొక్కుకోవడం కష్టమై, ఇల్లు కొనడం వంటి కీలక జీవిత లక్ష్యాలు ఆలస్యమవుతున్నాయని నివేదిక పేర్కొంది.నిరుద్యోగ గండం.. ఇప్పటికే మొదలైంది!గడిచిన ఏడాది కాలంలో ఏఐ సంబంధిత మార్పుల వల్ల నెలకు సుమారు 16,000 ఉద్యోగాల వృద్ధి తగ్గినట్లు గోల్డ్‌మన్ సాక్స్ అంచనా వేసింది. రాబోయే దశాబ్ద కాలంలో అమెరికాలోని సుమారు 7 శాతం మంది ఉద్యోగులపై ఈ లేఆఫ్స్ ప్రభావం ఉండవచ్చని తెలిపింది. ముఖ్యంగా ఆర్థిక మాంద్యం సమయంలో ఇలాంటి ఉద్యోగ నష్టాలు జరిగితే కోలుకోవడం మరింత భారంగా మారుతుంది.రీట్రైనింగ్ ఒక్కటే మార్గంఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఒక శుభవార్త ఉంది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త నైపుణ్యాలను నేర్చుకున్న వారి పరిస్థితి మెరుగ్గా ఉంది.కొత్త స్కిల్స్ నేర్చుకున్న వారి వేతన వృద్ధి మరో 2 శాతం పెరుగుతోంది.వీరు మళ్ళీ నిరుద్యోగులుగా మారే అవకాశం 10 శాతం తగ్గుతోంది. గోల్డ్‌మన్ సాక్స్ ప్రకారం.. ఏఐ విప్లవాన్ని తట్టుకోవాలంటే ప్రభుత్వం, కంపెనీలు రీట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించడం అత్యంత అవసరం.మొత్తంగా చెప్పాలంటే, ఏఐ వల్ల వచ్చే మార్పులు అనివార్యం. కేవలం ఉద్యోగం పోతుందని భయపడటం కంటే, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారానే ఈ లేఆఫ్స్ గండం నుండి గట్టెక్కవచ్చు. గోల్డ్‌మన్ సాక్స్ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు కోసం సిద్ధపడటం ప్రతి ఉద్యోగికి నేడు ఒక అనివార్యమైన బాధ్యత.

## ఇరాన్ ప్రతిపాదనను చెత్త బుట్టలో పడేసిన ట్రంప్



### టెహ్రాన్ కోరికల జాబితాను ఆమోదించే ప్రసక్తే లేదన్న వైట్ హౌస్..

ఇరాన్ పంపిన శాంతి ప్రతిపాదనపై వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రతిపాదనను ట్రంప్ చెత్తబుట్టలో పడేశారని తెలిపారు. ఇవి ఆచరణయోగ్యం కావని, పూర్తిగా అసంబద్ధమైనవిగా ఉన్నాయన్నారు. ఇరాన్ పంపిన తొలి శాంతి ప్రతిపాదనను డొనాల్డ్ ట్రంప్, ఆయన సంప్రదింపుల బృందం ఎంత కఠినంగా తిరస్కరించాయో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.ఇరాన్ ప్రతిపాదించిన అంశాలు అమెరికా జాతీయ ప్రయోజనాలకు ఏమాత్రం అనుగుణంగా లేవని, అందుకే ఆ ప్రతిపాదనను ప్రాథమికంగానే అసంబద్ధమైనదిగా పరిగణించి పక్కన పెట్టేశారని ఆమె వివరించారు. లీవిట్ మాటల్లో చెప్పాలంటే.. అధ్యక్షుడు ట్రంప్ ఆ ప్రతిపాదనను ఏమాత్రం ఉపేక్షించకుండా అక్షరాలా చెత్తబుట్టలో పడేశారు. ఇది ఇరాన్ పట్ల ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిక్కచ్చి వైఖరిని ప్రతిబింబిస్తోంది. ఇరాన్ తన కోరికల జాబితాను ఒక ఒప్పంద పత్రంలా భావించి పంపడం ఆమోదయోగ్యం కాదని, అటువంటి ఏకపక్ష డిమాండ్లను అమెరికా ఎన్నడూ అంగీకరించబోదని ఆమె నొక్కి చెప్పారు.ముఖ్యంగా, ప్రస్తుతం బహిరంగంగా ప్రచారంలో ఉన్న ఇరాన్ యొక్క 10-సూత్రాల ప్రణాళికకు, వాస్తవంగా చర్చల వేదికపై జరిగిన సంభాషణలకు అస్సలు పొంతన లేదని లీవిట్ వెల్లడించారు. ఇరాన్ ప్రభుత్వం ప్రజల ముందు ఒక రకమైన ప్రతిపాదనను ఉంచుతూ, తెరవెనుక మరో రకమైన అసమంజసమైన కోరికలను కోరుతోందని ఆమె వ్యాఖ్యల సారాంశం. ఆదేశాల మేరకు, జీణ ఝఅఝవ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి అమెరికా ప్రతినిధి బృందం ఈ వారాంతంలో కు వెళ్లనుంది. ఈ బృందంలో ప్రత్యేక రాయబారి సలహాదారు కూడా ఉన్నారు. ప్రెస్ సెక్రటరీ తెలిపిన వివరాల ప్రకారం.. అధికారులతో దౌత్య చర్చలు జరగనున్నాయి. ప్రాంతీయ భద్రత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలపై ఈ చర్చలు కేంద్రీకృతం కానున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం మొదటి విడత చర్చలు ప్రారంభం కానున్నాయి.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

### 250 మంది మృతి



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్.. లెబనాన్‌పై భీకర వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో 250 మందికి పైగా మరణించగా, 1100 మందికి పైగా గాయపడ్డారు. ఈ పరిణామ ంతో కాల్పుల విరమణ ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కాల్పుల విరమణను ప్రకటించారు. హర్మ్యూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించింది. అయితే, ఈ ఒప్పందం ప్రకటించిన వెంటనే ఇజ్రాయెల్.. లెబనాన్‌లోని బీరుట్, బెకా లోయ సహా హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం తమకు, హిజ్బుల్లాకు మధ్య జరుగుతున్న పోరాటానికి వర్తించదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కూడా లెబనాన్‌లో జరుగుతున్నది ఒక "ప్రత్యేక ఘర్షణ" అని వ్యాఖ్యానించారు.ఈ దాడులను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. ఒప్పందం కుదిరిన గంటల వ్యవధిలోనే ఇంతటి మారణహోమం జరగడం నమ్మశక్యంగా లేదని యూఎన్ మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హిజ్బుల్లా ప్రకటించింది. "ఇజ్రాయెల్-అమెరికా దురాక్రమణ ఆగే వరకు తమ ప్రతిదాడులు కొనసాగుతాయి" అని హిజ్బుల్లా హెచ్చరించింది.ఈ పరిణామాల నేపథ్యంలో ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు అత్యంత కీలకంగా మారాయి. కాల్పుల విరమణ వార్తతో 95 డాలర్ల దిగువకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర, లెబనాన్ దాడులతో మళ్లీ 97 డాలర్లకు పెరిగింది.




# ‘అనకాపల్లి’లో సంగీత ఉగ్రరూపం


## గూస్ బంప్స్ తెప్పిస్తున్న అమ్మోరు దిగినాది సాంగ్

నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా ఫేమ్ యాక్టర్ విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ఠ, తారక్ పొన్నప్ప లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం ‘అనకాపల్లి’ ఇంటెన్స్ పల్లెటూరి యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతున్నట్టు ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. విక్రమ్ సాహిదేవ్ తన సరికొత్త లుక్, పవర్‌ఫుల్ యాక్టింగ్‌తో ఇంప్రెస్ చేస్తున్నాడు. ఈ వేసవి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఈ మూవీ నుంచి అమ్మోరు దిగినాది సాంగ్‌ను విడుదల చేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటలో సీనియర్ నటి సంగీత ఉగ్రరూపం చూడొచ్చు. అగ్రెసివ్‌గా మంగ్లీ వాయిస్‌తో సాగుతున్న ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలువనుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఓ జాతరను చూస్తున్నామా..? అన్నట్టుగా సాగుతున్న ఈ పాట మ్యూజిక్ లవర్స్‌కు కనెక్ట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీలో త్రినాధరావు నక్కిన, ఇంద్రజ అబ్బుర్, మహబూబ్‌నగర్ భాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాంద్రేగుల నాయుడు, నందినీ రాయ్, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నక్కిన నరేటివ్స్, భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాంద్రేగుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు త్రినాథరావు నక్కిన స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించగా.. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నాడు. డావ్‌జాండ్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నాడు.



## అది నా పెద్ద తప్పు, ఆ సమయంలో నా మైండ్ పని చేయలేదు.. ఫరియా అబ్దుల్లా ఎమోషనల్

బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం (మే 1 విడుదల) ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. ‘జాతిరత్నాలు’ తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ‘హనుమాన్’ వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా ‘నో’ చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది.కథలు ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ ‘గాయపడ్డ సింహం’ సినిమాపైనే పెట్టుకుంది.



# యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఎపిక్.. టీజర్ రిలీజ్

బేబీ మూవీ జోడీ మరోసారి బిగ్ స్క్రీన్‌పై సందడి చేయనుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కుతోన్న మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్. ఈ సినిమాకు 90ం ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ చూస్తుంటే యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కాలేజీ డేస్, కెరీర్ నేపథ్యంలో ఈ మూవీ కథ ఉండనున్నట్లు టీజర్‌లో అర్థమవుతోంది. ఈ చిత్రంలో శివాజీ కీలక పాత్రలో కనిపించనున్నారు. కాగా.. ఈ సినిమాకు హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతమందిస్తున్నారు.




# అల్లు అర్జున్ రాకా.. అప్పుడే క్యూ కడుతున్నారా?

పుష్ప తర్వాత అల్లు అర్జున్ రేంజ్ పూర్తిగా మారిపోయింది. ఆయన మార్కెట్ కేవలం దక్షిణాదిలోనే కాదు..నార్త్‌లోనూ ఫుల్ క్రేజ్ ఉంది. పుష్ప-2 రిలీజ్ టైమ్‌లో బీహార్‌లో గ్రాండ్‌గా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. పుష్ప 2 నార్త్‌లో కేవలం హిందీలోనే రూ. 812 కోట్లు వసూలు చేసి రికార్డ్ సృష్టించింది. దీంతో బన్నీకి ఉత్తారాదిలోనూ భారీస్థాయిలో మార్కెట్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం తెరకెక్కుతోన్న రాకా మూవీపై నార్త్ ఆడియన్స్‌లోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అట్లీ డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమా కోసం డిస్ట్రిబ్యూటర్స్ క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా హక్కుల కోసం బిహార్‌లో తీవ్రమైన పోటీ ఉందని ఓ నివేదికలో వెల్లడైంది. ఆ రాష్ట్రంలో ఈ సినిమా హక్కుల కోసం ఇప్పటికే ‘రాకా’ చిత్ర నిర్మాతలను సంప్రదించారని తెలిపింది.

ఈ మూవీ రైట్స్ కోసం భారీ ధర చెల్లించేందుకు డిస్ట్రిబ్యూటర్స్ రెడీగా ఉన్నారట. ఇదంతా చూస్తుంటే బిహార్‌లో బన్నీకి ఎంత క్రేజ్ ఏంటో అర్థమవుతోంది. కాగా.. పుష్ప 2: ది రూల్ మూవీ బీహార్‌తో పాటు ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్‌లోనూ కలెక్షన్ల వర్షం కురిపించింది. ఇప్పుడు రాకా సినిమాకు సైతం ఇలాంటి స్పందనే వస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూవీ రైట్స్ కోసం భారీ పోటీ నెలకొంది. కాగా.. ఈ చిత్రంలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా టైటిల్‌తో ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మూవీని తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.